ప్రజాశక్తి
కర్నూలు
గురువారం
జనవరి
04 - 2018
12 పేజీలు



జన్మభూమి కార్యక్రమం రెండో రోజు డోన్ మండలం ఉంగరానిగుండ్ల గ్రామంలో కలెక్టర్ సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

వార్త 4లో

ఘోర రోడ్డు ప్రమాదం






- ఏడుగురు వలస కూలీలు మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- చిన్నహోతూరు వద్ద ఘటన
- విషాదంలో కొత్తపేట గ్రామం

వారంతా వలస కూలీలు. మూడు నెలల క్రితం పొట్ట చేతపట్టుకుని వేరే ప్రాంతానికి వలస వెళ్లారు. అక్కడ పనులు చేసుకుని తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. ఇంకో గంటలో ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని చర్చించుకుంటున్నారు. ఇంతలో ఏదో పగిలిన శబ్దం. ఏమైందో తెలుసుకునేలోపే ప్రమాదం జరిగిపోయింది. కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిన్న హోతూరు వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.

వార్త 4లో



వార్త 4లో

సిఎం పర్యటనకు

భారీ ఏర్పాట్లు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లపై అధికారులు కుస్తీ పడుతున్నారు. జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటిస్తుండడంతో ఆయా శాఖలకు సంబంధించిన కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. 7న ఆత్మకూరులో సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి ముఖ్య మంత్రి చంద్రబాబు హాజరు కానున్నారు. అలాగే అక్కడే జన్మభూమి గ్రామసభలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటిస్తుండడంతో కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించకుండా జన్మభూమి సభలా.. : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా జన్మభూమి కార్యక్రమాలు జరపడం ఎంతవరకు సమంజసమని సిపిఎం కల్లూరు మండల కార్యదర్శి వెంకటరాముడు, మండల నాయకులు సోమన్న విమర్శించారు. బుధవారం సూర్యనారాయణ భవన్‌లో సిపిఎం జిల్లా మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లూరు మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించిన తరువాతే జన్మభూమి కార్యక్రమం చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. నాయకులు కృష్ణ, నాగస్వాములు, శేఖర్, మద్దిలేటి, పి.మద్దిలేటి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్ విడుదల

ఈ నెల 10, 11, 12 తేదిలలో ఆలూరులో జరుగుతున్న సిపిఎం జిల్లా 21వ మహాసభలను పురస్కరించుకుని గోడపత్రికలను కర్నూలు కొత్త సిటీ కమిటీ (కల్లూరు అర్బన్) ఆధ్వర్యంలో స్థానిక కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి టి.రాముడు, నాయకులు పుల్లారెడ్డి, సాయిబాబా, గోపాల్, సుధాకరప్ప, వీరన్న, యేసు మాట్లాడారు. జిల్లా అభివృద్ధిపై జరిగే ఈ మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే...

కర్నూలు సిటీ : దేశ చరిత్రలోనే సంఘ సంస్కర్తగా, మహిళా ఉపాధ్యాయురాలుగా సమాజంలో మార్పులు చేసిన తొలి మహిళ సావిత్రిబాయిపూలేనని వైసిపి రాష్ట్ర కార్యదర్శి బివై.రామయ్య అన్నారు. బుధవారం కృష్ణకాంత్‌ప్లాజాలోని వైసిపి జిల్లా కార్యాలయంలో సావిత్రిబాయిపూలే 187వ జయంతి వేడుకలను ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు రాజేంద్రప్రసాద్ నాయుడు, ఫిరోజ్, శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనాథ్, విజయకుమారి పాల్గొన్నారు.

పత్తికొండ : సావిత్రిబాయి పూలే జయంతిని మహిళాదినోత్సవంగా లేదా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని రాష్ట్ర మినిమం వేజ్ అడ్వయిజర్ బోర్డు డైరెక్టర్ అశోక్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. నాగేష్, దినేష్, శంకర్ పాల్గొన్నారు.

దేవర ఉత్సవాల్లో ప్రముఖులు

తుగ్గలి : మండలంలోని జొన్నగిరి, రామాపురం, చిన్న జొన్నగిరి గ్రామాల్లో బుధవారం జరిగిన నెల్లూరమ్మ, అంకాలమ్మ, సుంకులమ్మ దేవర ఉత్సవాలకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముందుగా దేవర ఉత్సవాలకు విఆర్ఒ జయరామిరెడ్డి ఇంటి నుండి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఉత్సవాల్లో కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు లక్ష్మిరెడ్డి, కారెం భాస్కర్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తిమ్మయ్య, వైసిపి పత్తికొండ ఇన్‌ఛార్జి చెరుకులపాడు శ్రీదేవి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, దేవేంద్ర, వెంకటేష్, లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు నిధులు మంజూరు చేయాలి : ఎంపీ

కర్నూలు సిటీ : కోడుమూరు, ఇతర 21 గ్రామాల ప్రజలు శాశ్వతంగా తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి నాబార్డు, ఎఐఐబి నిధులు మంజూరు చేయాలని ఎంపీ బుట్టారేణుక కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం తాగునీటికి ప్రజలు బోరు బావులపై ఆధారపడ్డారని అన్నారు. తాగునీటి కొరత తగ్గించడానికి గాజులదిన్నె ప్రాజెక్టు ఆధారంగా రూ.56 కోట్లకు 2015-16లో ప్రతిపాదించామన్నారు. ఈ నిధులను నాబార్డ్ లేదా ఎఐఐబి ద్వారా మంజూరు చేయాలని కోరారు.

కర్నూలులో ప్రావిడెంట్ ఫండ్
ఉప కార్యాలయం ఏర్పాటు చేయాలి : ఎంపీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - కర్నూలు సిటీ

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రావిడెంట్ ఫండ్ ఉప కార్యాలయాల్లో ఒకటి కర్నూలులో ఏర్పాటు చేయాలని ఎంపీ బుట్టా రేణుక కోరారు. బుధవారం కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి సంతోష్ కుమార్ గంగోవర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించిన వ్యవహారాలపై ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలో సుమారు 1,10,000కు మించి ఖాతాదారులు, సుమారు 60,000కు మించి పదవీ విరమణ పొందిన ఖాతాదారులు ఉన్నారని చెప్పారు. వీరందరూ తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు 200 నుండి 350 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దాదాపు మూడు పర్యాయాలు ప్రాంతీయ ఉప కార్యాలయం స్థాపించేందుకు సిద్ధమైనా ఇంతవరకు సఫలీకతం కాలేదన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని 7 ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయాలు, 2 ఉప కార్యాయాలు ఉంటే ఎపిలో కేవలం 4 కార్యాయాలు, 1 ఉప కార్యాలయం మాత్రమే ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఉప ప్రాంతీయ కార్యాలయాల్లో ఒక దానిని కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరారు.



కేంద్ర మంత్రికి వినతి అందజేస్తున్న ఎంపీ బుట్టారేణుక

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ కార్మికులు నిరసన

ఓర్వకల్ : విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మండలంలోని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు నల్లబ్యాడ్జీలతో బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎపి విద్యుత్ కాంట్రాక్టు కార్మికల ఐక్యవేదిక నాయకులు మాదవ్, శరత్‌కుమార్, భరత్‌కుమార్, సిహెచ్ ప్రసాద్, పోలయ్య, సత్యనారాయణ, మనీశ్వరరెడ్డి మాట్లాడారు. విద్యుత్ రంగ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరికీ సమానపనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. దశల వారీగా ఉద్యోగులందరినీ రెగ్యూలర్ చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. బిల్ కలెక్టర్లకు, మీటర్ రీడర్లకు పీస్‌రేట్ రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అవుట్‌సోర్సింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై పరిష్కరించకపోతే ఈనెల 27 నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ శాఖ డిఇ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రజా సమస్యలను విస్మరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - మద్దికెర

జన్మభూమి కార్యక్రమంలో అధికారులు కేవలం ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను వివరించడంతో సరిపెట్టి ప్రజాసమస్యలను విస్మరిస్తున్నారని సిపిఎం డివిజన్ కార్యదర్శి వీరశేఖర్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా ఎంపికైన ఫించన్లు, ఎన్టీఆర్ గృహాలకు మంజూరైన లబ్దిదారుల సంఖ్యను చెబుతున్నారనే కానీ పేర్లను తెలపడం లేదన్నారు. దీనివల్ల అధికారపార్టీకి చెందిన వారికే సంక్షేమ పథకాలు అందుతాయే తప్ప నిరుపేదలకు అందవన్నారు. సమస్యలు పరిష్కరించని ఇలాంటి కార్యక్రమాలు ఎన్ని నిర్వహించినా ప్రజలు ఆసక్తి చూపరన్నారు.

'జన్మభూమి'కి రాష్ట్రస్థాయి అధికారులు నియామకం

కర్నూలు కలెక్టరేట్ : ఐదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్రస్థాయి నోడల్ అధికారులను ప్రభుత్వం నియమించింది. కర్నూలు, నందికొట్కూరు నియోజకవర్గాలకు రాయలసీమ రేంజ్ ఐజి ఇక్బాల్ అహ్మద్, ఆదోని, ఆలూరుకు ఇరిగేషన్ ప్రాజెక్టు సిఇ నారాయణరెడ్డి, ఎమ్మిగనూర్, మంత్రాలయంకు డిఎఫ్ఒ శివరాం, పత్తికొండ, కోడుమూరుకు సోషల్ ఫారెస్టు అఫీసర్ యశోదభాయి నియమించింది. డోన్‌కు హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి అసన్ రిజా, పాణ్యం, బనగానపల్లెకు సిసిఎఫ్ గోపినాథ్, ఆళ్లగడ్డ, నంద్యాలకు నంద్యాల డిఎఫ్ఒ శివప్రసాద్, శ్రీశైలంకు డిఐజి కెవివి గోపాల్‌రావులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్రస్థాయి నోడల్ అధికారులు ప్రతి రోజు ఈ నియోజికవర్గాల్లో జరిగే జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని ఎప్పటికప్పుడు నివేదికలను అందజేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

రైతు రుణమాఫీ ఘనత టిడిపి ప్రభుత్వానిదే



కోడుమూరులో...

ప్రజాశక్తి - కోడుమూరు

రైతులకు రుణామాఫీ చేసిన ఘనత టిడిపి ప్రభుత్వానిదేనని టిడిపి నాయకులు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెంకటగిరి గ్రామంలో జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభాకర్, టిడిపి మండల కన్వీనర్ కెఇ.మల్లిఖార్జున గౌడు, మండలాధ్యక్షులు కె.నాగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. అధికారులు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరేలా కృషి చేయాలన్నారు. అనంతరం 3వ విడత రుణమాఫీ పత్రాలు, రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. చాలా మంది ప్రజలు గృహాలు, ఫించన్లు మంజూరు చేయాలని వినతులు అందజేశారు. నోడల్ అధికారి భాస్కర్‌రెడ్డి, ఎంపిడిఒ ఆదెయ్య, తహశీల్దార్ రామకృష్ణ, అన్ని శాఖల అధికారులు టిడిపి నాయకులు దుబ్బన్న, గంగాధర్, చంద్ర పాల్గొన్నారు.

గూడురు రూరల్ : ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలను అర్హులైన లబ్దిదారులు పొంది సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మణిగాంధీ పేర్కొన్నారు. మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కోడుమూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి మల్లిఖార్జున, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, సర్పంచు శ్రీనివాసలు, ఎంపిడిఒ నాగేశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ శివశంకర్‌నాయక్, మండల కన్వీనర్ సుందర్‌రాజు, ఎంపిటిసి బజారి పాల్గొన్నారు.

జన్మభూమి కార్యక్రమానికి తహశీల్దార్, ఎంపిడిఒ డుమ్మా

తుగ్గలి : ముక్కెల్ల, మారెల్ల గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి తహశీల్దార్ గోపాల్‌రావు, ఎంపిడిఒ అమృతరాజ్ డుమ్మాకొట్టారు. దీంతో ప్రజలు, రైతులు సమస్యలపై అర్జీలను ఎవ్వరికి ఇవ్వాలని అధికారులపై మండిపడ్డారు. ఈ సందర్భంగా జడ్పిటిసి వరలక్ష్మి మాట్లాడుతూ తహశీల్దార్, ఎంపిడిఒలు రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. స్పెషల్ ఆఫీసర్ చిన్నన్న, ఎపిఎం క్రిష్ణమూర్తి, ఎంఇఒ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.



తుగ్గలి కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పిటిసి

మద్దికెర : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కెఇ.క్రిష్ణమూర్తి మండలంలోని బసిమేపల్లి గ్రామంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి హాజరు కానున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. అలాగే పెరవలి గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామదేవర జాతరకు హాజరవుతారని పేర్కొన్నారు.

జన్మభూమి అర్జీలు దళారుల చేతికి : సిపిఎం

కర్నూలు కార్పొరేషన్ : నగరంలో బుధవారం 4,5,6 వార్డులలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో అర్జీలు దళారుల చేతికియిచ్చి రూ.20లకు అమ్ముతున్నారని, రాయడానికి రూ.10లు తీసుకోవడం చాలా దారుణమని సిపిఎం నాయకులు అబ్దుల్ దేశాయ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ గురించి మాట్లాడడం ఎమ్మెల్యేకు తగదన్నారు. జమ్మిచెట్టు దగ్గర జరిగిన కార్యక్రమంలో హంద్రీనదికి, తుంగభద్ర నదికి కరకట్టలు నిర్మించాలని డిమాండ్ చేశారు. డంప్‌యార్డును వేరొకచోటికి తరలించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. షరీఫ్, పార్వతయ్య, ఇంతియాజ్, రవి, మల్లి, మురళి, ఖరీమ్, రెహమాన్ పాల్గొన్నారు.



ఏరాసుప్రతాప్ రెడ్డిని నిలదీస్తున్న సిపిఎం నాయకులు

హామీలు ఎన్ని అమలు చేశారో తెలపండి : సిపిఎం

2014లో నగరంలో ముఖ్యమంత్రి జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో తెలపాలని సిపిఎం నాయకులు టిడిపి నాయకులు ఏరాసు ప్రతాప్ రెడ్డిని నిలదీశారు. 26వ వార్డు క్రిష్ణానగర్‌లోని విఠల్ నగర్‌లో జరిగిన 5వ జన్మభూమి సభలో సిపిఎం నాయకులు రాముడు మాట్లాడుతూ 2002 లో కార్పొరేషన్‌లో విలీనమయిన కల్లూరు అర్బన్ ప్రాంతం 15 సంవత్సరాలైనా రోజూ మంచినీరు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. క్రిష్ణానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి కింద రెండు వైపులా సిసిరోడ్లు, తారకరామా కాలనీలో అండర్‌బ్రిడ్జి కింద డ్రైనేజీ నిర్మించి సిసిరోడ్లు వేయాలన్నారు. క్రిష్ణానగర్ ఐటిసి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు జన్మభూమి సభద్వారా ప్రభుత్వానికి నివేదించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ హరినాథరెడ్డి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సిపిఎం నాయకులు రాముడు, సాయిబాబా, 26వ వార్డు కార్యదర్శి లక్ష్మయ్య, భాస్కర్‌రెడ్డి, వీరన్న, కల్లూరు కాలనీల అభివృద్ధి కమిటీ కార్యదర్శి ప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

ఓర్వకల్ : ప్రజాసమస్యల పరిష్కారమే టిడిపి ధ్యేయమని కెడిసిసి బ్యాంకు చైర్మన్ మల్లిఖార్జునరెడ్డి పేర్కొన్నారు. పూడిచర్ల గ్రామంలో జరిగిన జన్మభూమి గ్రామసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సర్పంచి సరోజమ్మ, తహశీల్దార్ రజనీకుమారీ, ఆయా శాఖల అధికారులు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పుల్లారెడ్డి, శివుడు, తిరుపాల్‌రెడ్డి, ప్రకాశం, ప్రజలు పాల్గొన్నారు.

ముడుమాలలో బెల్టుషాపు ఎత్తేయాలి

- జన్మభూమిలో గ్రామస్తుల ఆందోళన
- సమస్యలు పరిష్కరిస్తామని అధికారుల హామీ

సి.బెళగల్ : మండలంలోని ముడుమాల గ్రామంలో బెల్టు షాపును ఎత్తివేయాలని గ్రామస్తులు, పొదుపు సంఘాలు బుధవారం ఆందోళన నిర్వహించారు. ఎంపిడిఒ సిద్ధలింగ మూర్తి, ఇఒఆర్‌డి సుమిత్రమ్మ అధ్యక్షతన బుధవారం గ్రామంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి ప్రసాద్‌రావు, త్రికోన శాఖాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభించగానే ఆయా సమస్యలతో పాటు, బెల్టు షాపు ప్రధాన సమస్యగా మారిందని అధికారులకు విన్నవించినా పట్టించుకొనేది ఎవ్వరంటూ ప్రజలు మండిపడ్డారు. మండలంలో రెండు మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మరింత ఆదాయం పొందేందుకు సిండికేట్‌గా మారింది. ఈ నదీ తీర గ్రామాలకు సంబంధించి ముడుమాల గ్రామంలో అనాధికారికంగా దుకాణాన్ని తెరవడం సరికాదని పేర్కొన్నారు. నెల నెల అధికారులు మామూళ్లు తీసుకొని ఇక్కడ అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాలు ఆర్థికంగా చితికిపోవడం, కుటుంబాల్లో కలహాలు, వ్యక్తుల మధ్య విభేదాలు, మహిళలు పడుతున్న సమస్యలు ఎవ్వరికి పట్టడం లేదని పేర్కొన్నారు. వెంటనే బెల్టు షాపును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికెళ్లి పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ప్రజా సమస్యల పట్ల బాధ్యత యుతంగా వ్యవహరించా లని నోడల్ అధికారి ప్రసాద్‌రావు అధికారులకు ఆదేశించారు.

కొండాపురంలో : కొండాపురం గ్రామంలో ఎంపిడిఒ సిద్ధలింగమూర్తి, ఇఒఆర్‌డి సుమిత్రమ్మ అధ్యక్షతన జన్మభూమి - మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ప్రసాద్‌రావు హాజరై, మాట్లాడారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న బిల్లులు అందడం లేదని, ఎన్టీఆర్ గృహాలకు ఇతర పనులకు వెంటనే ఇసుక ఉన్న అనుమతుల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఒక్కొక్కరిగా విన్నవించారు.

గడివేముల : జన్మభూమి కార్యక్రమం ద్వారా గ్రామంలోని సమస్యలు పరిష్కారమవుతాయని స్పెషలాఫీసర్ మహమ్మద్ ఆలీ కోరారు. బుధవారం పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో జన్మభూమి - మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ 50 రేషన్‌కార్డులు పంపిణీ చేశామన్నారు. 60-రేషన్‌కార్డులు, 20 పింఛన్ల కోసం దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఎవరైన మరుగుదొడ్లు నిర్మించుకోని వారు ఉంటే వెంటనే నిర్మించుకోవాలని కోరారు. అనంతరం 30 మందికి సీమంతాలు నిర్వహించామని తెలిపారు. గ్రామంలోని బాల, బాలికలకు వివిధ పోటీలు నిర్వహించామన్నారు. తహశీల్దార్ వెంకటేష్ నాయక్, ఎంపిడిఒ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి జాన్సీన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ లక్ష్మి నరసింహ పాల్గొన్నారు.

క్రిష్ణగిరి : గ్రామాలాభివృద్ధి చెందాలంటే గ్రామస్తుల భాగస్వామ్యం ఎంతో అవసరమని మండల నోడల్ అధికారి రఘునాథరెడ్డి, జడ్‌పిటిసి మాజీ సభ్యులు కెఇ.జయన్న అన్నారు. అమకతాడు గ్రామంలో సర్పంచు లక్ష్మిదేవి అధ్యక్షతన జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అన్నప్రాసన, సీమంతాలు జరిపారు. ఎంపిటిసి సభ్యుడు మధుసుదన్‌నాయుడు, ఎంపిడిఒ మురళిమోహన్‌మూర్తి, తహశీల్దార్ రామసుబ్బయ్య, జన్మభూమి కమిటీ సభ్యులు శ్రీరాములు, నబి సాహెబ్ అధికారులు పాల్గొన్నారు.

సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

రజకుల ఆత్మగౌరవం కాపాడేందుకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఎపి రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాస్కరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందుగా 2018 సంవత్సరం రజకవృత్తిదారుల సంఘం క్యాలెండర్‌ను బుధవారం స్థానిక కెకె భవనంలో రాష్ట్ర అధ్యక్షులు భాస్కరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుశేఖర్, జిల్లా అధ్యక్షులు నాగరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నాగరాజు అధ్యక్షత వహించారు. అనంతరం సావిత్రిబాయిపూలే చిత్రపటాని పూలమాలలు వేసి, నివాళిలర్పించారు. భాస్కరయ్య మాట్లాడుతూ నేటికి రజకులపై దాడులు, గ్రామ బహిష్కరణలు, మహిళలపై అత్యాచారాలు, కులదూషణలు కొనసాగుతున్నాయన్నారు. వాటిని అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ తరహాలో ప్రత్యేక చట్టాన్ని చేయాలని అన్నారు. మహిళా నాయకురాలు మనోరమ, జయమ్మ మాట్లాడుతూ కమిటీలుగా ఏర్పడి సమస్యలపై చాకలి ఐలమ్మను ఆదర్శంగా పోరాటలలోకి రావాలని పిలుపునిచ్చారు. వృత్తిసంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ శేషయ్య, సంఘం గౌరవాధ్యక్షులు గోవింద


సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరయ్య

మాట్లాడారు. రజక వృత్తిదారుల సమస్యలపై రానున్న రోజుల్లో పెద్దఎత్తున పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు , గురుశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో రజకులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో దోబి ఘాట్స్‌ను నిర్మించి, ఆధునాతమైన పనిముట్లు అందజేయాలనానరు. నాయకులు శ్రీనివాసులు, హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షులు ముక్కన్న, వెంకటేశ్వర్లు, అంజనమ్మ, గురుస్వామి, రాముడు, ఎల్లయ్య, పుల్లన్న , శేషాద్రి, సత్యం, విజయమ్మ, రంగన్న, పుష్ప, మహేశ్వరి, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆదర్శం

గడివేముల : ప్రతి ఒక్క మహిళ సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఎంబిసి జిల్లా కార్యదర్శి గని ప్రసాద్ అన్నారు. బుధవారం సావిత్రిబాయి పూలే 187వ జయంతిని ఎంబిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అనంతరం ఆమె చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. మండలాధ్యక్షుడు గోపాల్, దాసరి నాగరాజు, వెంకటేశ్వర్లు, గోపాల్ పాల్గొన్నారు.


పూలమాల వేస్తున్న పెద్దిగారి లక్ష్మన్న

కర్నూలు కలెక్టరేట్ : యుటిఎఫ్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్మారక పాఠశాలలో సావిత్రిబా పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యుటిఎఫ్ సీనియర్ ఉపాధ్యాయులు ఎస్ విజయలక్ష్మి, నగర గౌరవాధ్యక్షులు జి సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ వారు ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. నాయకులు ఎస్ రమాదేవీ, జె రఘునాథ్, రాజ్యలక్ష్మి, శోభరాణి, నీలమణి, మాధవిలత, నిర్మలాదేవి, అరుణకుమారిపాల్గొన్నారు.

గార్గేయాపురం పాఠశాలలో :కర్నూలు మండలంలోని గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాపూలే జయంతి నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు


గీతాంజలిలో..

డి రామశేషయ్య ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్‌లో : శ్రీరామ్‌నగర్‌లోని భగత్‌సింగ్ లైబ్రరీలో సావిత్రిబాపూలే జయంతి వేడుకలను కెవిపిఎస్ నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నాయకులు ఎం ఎన్‌రాజు అధ్యక్షత వహించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్‌బాబు, నగర కార్యదర్శి రెడ్డివారి నర్సింహులు పాల్గొన్నారు. అనతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు అంజనేయులు, ఉరుకుందు, చంద్రమోహన్, బజారీ, తిమ్మప్ప పాల్గొన్నారు.

కర్నూలు క్రైం : స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని గీతాంజలి డిఎడ్ కళాశాలలో బుధవారం నాడు సావిత్రిబాయి 187వ జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరెస్పాండెంట్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ శిల్ప, కళాశాల సిబ్బంది గోపాలక్రిష్ణ, మద్దిలేటి, ప్రియదర్శిని పాల్గొన్నారు.

అమృత సైకలాజికల్ సెంటర్‌లో : స్థానిక అమృత సైకలాజికల్ కౌన్సిలింగ్ అండ్ హెచ్ఆర్‌డి సెంటర్‌లో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కౌన్సిలింగ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ పెద్దిగారి లక్ష్మన్న పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళిలర్పించారు. మూలగాజ రమేష్, ఎస్‌కె నాజియా, జి శ్యామల, చిన్న, సలీమ్, సిద్దు, శేఖర్, వీరప్ప పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

డోన్ : అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య చేసుకున్న సంఘటన డోన్ మండలంలోని తాడూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బత్తిన నారాయణ(45) చేసిన అప్పులు తీర్చలేక మంగళవారం అర్ధరాత్రి ఇంటిలో ఉరేసుకొని మృతి చెందాడు. మృతుని భార్య గతంలోనే మృతి చెందింది. ఇతనికి ఒక కుమారుడు ఉన్నట్లుగా తెలిపారు. రూరల్ ఎస్ఐ రామసుబ్బయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు తెలిపారు.

వాహనాలు ఢీకొని 19 గొర్రెలు మృతి

కోవెలకుంట్ల : జమ్మలమడుగు నుంచి కోవెలకుంట్ల రహదారిలో, గుళ్లదుర్తి గ్రామం సమీపంలో ఉన్న మలుపుల వద్ద వాహనాలు ఢీకొని 19 గొర్రెలు బుధవారం మృతువాత పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఉయ్యాలవాడ మండలం నర్సిపల్లెకు చెందిన మద్దిలేటి, బేతంచర్ల మండలం తరుచుకొండ గ్రామం నుండి జీవాల మందను స్వగ్రామమైన నర్సిపల్లెకు తీసుకెళ్తున్నాడు. గుళ్లదుర్తి గ్రామ సమీపంలోకి చేరుకొనే సరికి బుధవారం తెల్లవారు జామున జమ్మలమడుగు వెళ్లే టాటా సుమో వాహనం ఢీకొని 10 గొర్రెలు మృతి చెందాయి. కిలో మీటర్ దూరంకు వెళ్లిన తర్వాత జమ్మలమడుగు నుంచి కోవెలకుంట్లకు వెళ్లుతున్న లారీ ఢీకొట్టడంతో మరో 9 గొర్రెలు మృతి చెందాయి. వాహనా దారులు తగిన మూల్యాన్ని చెల్లించారు. ఎస్ఐ శ్రీధర్ సంఘటన స్థలానికి చేరుకొని లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారమివ్వాలి

కర్నూలు కార్పొరేషన్ : హోళగుంద మండల కొత్తపేటకు చెందిన వలస కూలీలు నల్గొండ జిల్లాకు వెళ్లి తిరిగి వస్తుండగా బుధవారం ఆలూరు-ఆస్పరి మధ్య చిన్నహోతూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 9 మంది కుటుంబాలకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి వారిని ఆదుకోవాలని వ్యకాస అధ్యక్ష కార్యదర్శులు నారాయణ, నాగేశ్వర్‌రావు, ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ నైతిక బాధ్యత వహించి ప్రమాదాల్లో మరణించిన వారికి 15 లక్షలు, గాయపడిన వారికి 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని ప్రజలందరికి సంక్షేమ ఫలాలందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ వెల్లడించారు. జన్మభూమిలో వచ్చే గ్రీవెన్సులన్నింటిని పరిష్కరిస్తామన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశపు భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 889 గ్రామ పంచాయితీలు, 270 మున్సిపాల్టీ వార్డుల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. 188 గ్రామ పంచాయతీలు, 64 మున్సిపాల్టీ వార్డుల్లో నిర్వహించామన్నారు. కొత్తగా 27,940 రేషన్‌కార్డులు, 5019 గృహాలకు ఇంటి నివాస పట్టాలను మంజూరు చేశామన్నారు. చంద్రన్న బీమా కింద 1.18 లక్షల మందికి ఉపకార వేతనాలను మంజూరు చేశామన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE : KURNOOL
Guardian O.P. No. 108 /2017
M.SagarKumar @ Sagar ... Petitioner
-Versus-
The officer O/O The Principal Accountant General,T.S & AP. Hyderabad. ... Respondent

GENERAL NOTICE

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం మేమనగా పై అర్జీదారు తన చెల్లెలు అయిన కుమారి నందినికి గార్డియన్‌గా వ్యవహరించుటకు పై కోర్టు నందు పై అర్జీదారు చేసి వుంటున్నారు. కావున పై అర్జీదారు దాఖలు చేసిన పై అర్జీపై ఏవరికైనన ఏమైన ఆక్షేపణలు వున్న యెడల పై తెలిపిన కోర్టులో తేది.18-01-2018వ తేది ఉదయం 10.30 గంటలకు మీరుకాని మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఏమైన అభ్యంతరములు వున్నచో తెలుపుకొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున పైన తెలిపిన పిటిషన్ తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు
వాయిదా: 18-01-2018

హెచ్.కె.జలంధర్
జి.గోపాలక్రిష్ణయ్య
అర్జీదారు తరపు న్యాయవాదులు, కర్నూలు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE : KURNOOL
Guardian O.P. No. 97 /2017
Sudha Rani and 2 others ... Petitioners
-Versus-
NIL ... Respondent

GENERAL NOTICE

ఇందుమూలముగా కర్నూలు జిల్లా యావన్మందికి తెలియజేయడం మేమనగా పై అర్జీదారు తన మైనర్ పిల్లలకు గార్డియన్‌గా నియమించమని కోరుతూ పిటిషన్ షెడ్యూలు దాఖల అస్తిని సర్వే నెం.231/బి ఎకరం : 3.04 సెంట్స్ బోయరేవుల గ్రామము వెలుగోడు మండలం,కర్నూలు జిల్లా వీరి పోషణ నిమిత్తం సదరు భూమిని అమ్ముటకు పర్మిషన్ కోరి పై అర్జీదాఖలు చేసి వుంటున్నారి. కావున పై అర్జీదారు దాఖలు చేసిన పై అర్జీపై ఏవరికైనన ఏమైన ఆక్షేపణలు వున్న యెడల పై తెలిపిన కోర్టులో తేది.23-01-2018వ తేది ఉదయం 10.30 గంటలకు మీరుకాని మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఏమైన అభ్యంతరములు వున్నచో తెలుపుకొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున పైన తెలిపిన పిటిషన్ తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు
వాయిదా: 23-01-2018

యస్.షాజుద్దీన్
యస్.బాబుసాహెబ్
అర్జీదారు తరపు న్యాయవాదులు, కర్నూలు.

మహారాజ శ్రీ డోన్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో డోన్.
E.P. No.78/2017 IN O.S. No. 56/2016
పి లక్ష్మీదేవమ్మ DHr
V/S
ఎస్ఎం హుస్సేన్ @ ఎస్ మహబూబ్ హుస్సేన్ JDr
S/O అహమ్మద్ హుస్సేన్, టీచర్, గవర్నమెంట్ ఐటిఐ కాలేజి ఎదురుగా, డోన్.
ప్రస్తుతం పనిచేస్తున్నది.
మున్సిపల్ అప్పర్ ప్రైమరి స్కూల్, బి క్యాంప్, సిల్వర్ జుబ్లీ కాలేజి ఎదురుగా, కర్నూలు టౌన్, కర్నూలు జిల్లా.
ORDER 21 AND RULE 48 AND Sec 151 OF C.P.C:

సదరు నెంబరులోని DHr మీ జీతమును జప్తికోరి మోషన్ దాఖలు చేసియుండి నందున ఈ విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల 08.01.2018వ తేదిన ఉదయం గం. 10.30 ని॥ లకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని ఈ కోర్టులో మీరు హాజరై పై కోర్టు వారితో మనవి చేసుకొనవలసినది. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమందు విచారించి తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.

(కోర్టువారి వుత్తర్వుల మేరకు)
వాయిదా తేది :08.01.2018

కోట్ల యోగానందరెడ్డి.
DHr అడ్వకేటు,

సిఎం పర్యటనకు భారీ ఏర్పాట్లు

ఆత్మకూరులో 4 వేల ఇళ్ల సముదాయానికి శంకుస్థాపన
200 బస్సులతో జన సమీకరణకు చర్యలు
7న సిద్ధాపురంలో ముఖ్యమంత్రి పర్యటన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఆత్మకూరు మున్సిపాలిటీకి దాదాపు 4 వేల గృహ నిర్మాణాల పథకం ఇంకా ప్రభుత్వం నుంచి ఆమోదముద్ర పొందలేదు. ఈ ప్రాజెక్టు విలువ దాదాపు రూ.160 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ గృహ నిర్మాణ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రాజెక్టుకు ఇంతవరకూ ఆమోదముద్ర పడలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా రూ.54 కోట్ల అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన చేయించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. గృహనిర్మాణ పథకానికి ప్రభుత్వం నుంచి మంజూరు కాకపోయినా ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం చేసుకోవచ్చు. మరో పక్క ముఖ్యమంత్రి నిర్వహించే బహిరంగసభకు దాదాపు 25 వేల మంది కూర్చొనేందుకు వేదికను సిద్ధం చేస్తున్నారు. ఈ బహిరంగ సభకు ప్రజలను సమీకరించేందుకు దాదాపు 200 బస్సులను సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన అంటేనే అధికారులు హడావుడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. మంజూరు కాని ప్రాజెక్టులకు కూడా శంకుస్థాపనలు చేయించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అధికారులే సిద్ధమవుతుండడం పట్ల పలువురు మండిపడుతున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగుతుందిలా...

ఉదయ గన్నవరం విమానాశ్రయం నుంచి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 10.30 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో నేరుగా సిద్ధాపురం గ్రామానికి చేరుకుంటారు. అక్కడి నుంచి సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి కాన్వాయ్ ద్వారా వెళ్తారు. అక్కడ 1 నుంచి 2 గంటల వరకూ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం చేపడతారు. అక్కడ ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. అనంతరం కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటారు. తర్వాత 3 గంటల నుంచి జన్మభూమి బహిరంగసభలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటల వరకూ సిఎం పర్యటించి కడప ఎయిర్‌పోర్టుకు బయల్దేరి వెళ్తారు.

అప్రమత్తంగా ఉండాలి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశపు భవనంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి హెలిప్యాడ్, బహిరంగసభ ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాలన్నారు. పర్యటన ముగిసే వరకూ అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. జెసి వి.ప్రసన్న వెంకటేష్, డిఆర్ఒ శశిదేవి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి - ఆస్పరి/హోళగుంద

వివరాలిలా ఉన్నాయి... హోళగుంద మండలం కొత్తపేట గ్రామానికి చెందిన 30 మంది వ్యవసాయ కూలీలు మూడు నెలల క్రితం నల్గొండ జిల్లా డోరపల్లి గ్రామానికి పత్తి కోత పనులకు వెళ్లారు. అక్కడ పని చేసి మంగళవారం సాయంత్రం టెంపో (ఎపి 21 వై 5669 నెంబరు గల) వాహనంలో స్వగ్రామానికి బయల్దేరారు. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో టెంపో వాహనం ఆస్పరి మండలం చిన్నహోతూరు వద్దకు చేరుకుంది. వాహనం కుడి వైపు వెనుక టైర్ పగిలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో హోళగుంద మండలం కొత్తపేట గ్రామానికి చెందిన షేకమ్మ (45), నర్సమ్మ (45), హనుమంతమ్మ (16), గోవిందమ్మ (55), నారాయణ (30), ఈరమ్మ (40), మంగమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన గోవిందమ్మ, నారాయణ ఆదోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. నారాయణ, ఈరమ్మ, మంగమ్మలను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. స్రవంతి అనే చిన్నారి ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతోంది. షేకన్న, నీలమ్మ, బాలరాజు, వెంకటేష్, లక్ష్మి, సుంకమ్మ, దుర్గమ్మ, గంగమ్మ కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే ఆస్పరి ఎస్ఐ శంకరయ్య సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లారు. క్షతగాత్రులను స్థానికులతో కలిసి ప్రత్యేక వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఆలూరు సిఐ అబ్దుల్ గౌస్ సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకరయ్య తెలిపారు.

పోలీసుల సేవలు భేష్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

సంఘటనా ప్రాంతంలో క్షతగాత్రులకు ఎస్ఐ శంకరయ్యతోపాటు పోలీసులు అందించిన సేవలను స్థానికులు కొనియాడారు. టెంపో కింద పడి మృతి చెందిన వారిని స్థానికులతో కలిసి బయటికి తీశారు. క్షతగాత్రులను కొంతమంది పోలీసులు భుజానికి వేసుకుని వాహనంలోకి ఎక్కించారు. ఆదోని ఆస్పత్రిలో కూడా పోలీసులు ఎత్తుకుని చికిత్స చేయించారు.

బాధిత కుటుంబాలకు పలువురి పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను ఆర్‌డిఒ ఓబులేసు, ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్ పరామర్శించారు. ఆర్‌డిఒ ఓబులేసు ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదోని ఆస్పత్రికి చేరుకుని సంఘటన తీరును తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. వీరభద్ర గౌడ్ కూడా బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని హామీఇచ్చారు.

మూగబోయిన కొత్తపేట

గ్రామంలోని ఏడుగురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కొత్తపేట గ్రామం మూగబోయింది. మృతి చెందిన వారిలో చాలామంది ఒకరికొకరు దగ్గరి బంధువులు ఉన్నారు. మృతి చెందిన వారిలో కొంతమంది ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్నారు. వారి మృతిని జీర్ణించుకోలేక కుటుంబ సభ్యులు రోధించి తీరు పలువురిని కంట తడి పెట్టించింది. టిడిపి సీనియర్ నాయకులు ముద్ద బసవన్న గౌడ్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు.

ఉప ముఖ్యమంత్రి కెఇ పరిశీలన

చిన్న హోతూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని ఉప ముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తి పరిశీలించారు. ఎస్పీ గోపీనాథ్ జెట్టిని సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీఇచ్చారు.

ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలి

ప్రజల సహకారంతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని ఎస్పీ గోపీనాథ్ జెట్టి తెలిపారు. చిన్న హోతూరు గ్రామం వద్ద జరిగిన ప్రమాదాన్ని ఆయన పరిశీలించారు. సంఘటన తీరును సిఐ అబ్దుల్ గౌస్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. టైరు పూర్తిగా అరిగిపోవడంతో పాటు, కెపాసిటీకి మించి లోడ్ ఉండడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. వాహన చట్టం నిబంధనల మేరకు వాహనచోదకులు వాహనాలను నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. గూడ్స్ వెహికల్‌లో ప్రయాణికులను ఎక్కించుకోవడం చట్టవిరుద్ధమన్నారు. హైవేలపై పోలీసులు తరచూ తనిఖీలు చేస్తున్నారని చెప్పారు. చిన్న పొరపాటు వల్ల పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డీఎస్పీ ప్రసాద్, ఆస్పరి, ఆలూరు ఎస్ఐలు శంకరయ్య, ధనుంజయ్య ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే దశలవారీ ఉద్యమం : సిపిఎం

ఆత్మకూరు : ప్రజా సమస్యల పరిష్కారానికి దశలవారీ ఉద్యమం నిర్వహించి పాలకులపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రజలు సిద్ధం కావాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వి.ఏసురత్నం, నాయకులు రణధీర్ కోరారు. బుధవారం స్థానిక సుదర్శన వర్మ స్మారక భవనంలో సిపిఎం జిల్లా 21వ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పోరాడుతోందని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయల సీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం జిల్లాకు సంవత్సరానికి రూ.500 కోట్లు ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరులో మొట్టమొదటిసారిగా మహాసభలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ మహాసభల సందర్భంగా 10న బుధవారం ఆలూరులో జరిగే ప్రదర్శన, బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు కదిలి రావాలని కోరారు. సిపిఎం పట్టణ నాయకులు ఇస్మాయిల్, రామునాయక్, నాగేశ్వరరావు, శంకర్, అలీబాష పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం : డిఐజి గోపాల్

ఆత్మకూరు : ఆరోగ్యమే మహాభాగ్యమని గుంటూరు డిఐజి గోపాల్ తెలిపారు. పట్టణంలోని 3వ వార్డులోని ఎస్‌పిజి పాలెం, 4వ వార్డులోని వడ్లపేట ఎలిమెంటరీ స్కూల్‌లో వార్డు కౌన్సిలర్లు సుగుణమ్మ, సలాంబాష అధ్యక్షతన జన్మభూమి జరిగింది. ముఖ్య అతిథిగా గోపాల్, నగర పంచాయతీ ఛైర్మన్ శివపురం నూర్‌మహ్మద్, హజ్‌కమిటీ ఛైర్మన్ అహ్మద్‌హుస్సేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఐజి గోపాల్ మాట్లాడారు. జన్మభూమిలో ప్రత్యేకించి ఆరోగ్య విషయాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అనంతరం కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందించడంతో పాటు కాలనీలోని గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కమిషనర్ రమేష్‌బాబు, సింగిల్‌విండో అధ్యక్షులు జడ్.శ్రీనివాసురెడ్డి, మాజీ ఎంపిపి వంగాల శివరామిరెడ్డి, టిడిపి నాయకులు గౌస్ అజం, డిటి లోకేష్, ఆర్ఐ సురేంద్ర పాల్గొన్నారు.

6న సిద్ధాపురంలో క్రికెట్ పోటీలు

ఆత్మకూరు : మండలంలోని సిద్ధాపురం గ్రామంలో 6న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సిద్ధాపురం గ్రామ నాయకులు బుధవారం తెలిపారు. మొదటి బహుమతిగా రూ.10,116, రెండో బహుమతి రూ.5,116 ఉంటాయని తెలిపారు. పోటీలో పాల్గొనే జట్లు ప్రవేశ రుసుం రూ.300 చెల్లించాలని చెప్పారు. ఇతర వివరాలకు సెల్ నెంబరు 9553537517, 7036496166లకు సంప్రదించాలని ఆర్గనైజర్లు లక్ష్మణ్, శ్రీధర్, దరగయ్య, సురేష్, వెంకటేష్, ఉపేంద్ర తెలిపారు.

గ్రామ సమస్యలు పరిష్కరించండి

ఆత్మకూరు : మండలంలోని కురుకుంద గ్రామ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం గ్రామ కార్యదర్శి పి.మాబాష కోరారు. కురుకుంద గ్రామంలో సర్పంచి కొండన్న అధ్యక్షతన జన్మభూమి నిర్వహించారు. సిపిఎం గ్రామ కార్యదర్శి మాబాష మాట్లాడారు. గత జన్మభూమిలో ఇచ్చిన వినతులను పరిష్కరించలేదని తెలిపారు. గ్రామంలోని హైస్కూల్ కాంపౌండ్ కోసం ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేసినా పనులెందుకు చేయలేదని ప్రశ్నించారు. దశరథ్ దేవానగర్‌లో 6 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాలు లేని పేదల కోసం ఏర్పాటు చేశారని, పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. రచ్చకట్ట నుంచి వెంగళరెడ్డితోట వరకూ సిసి రోడ్డు మంజూరు చేయాలని, భూములు కొనుగోలు చేసి ఎస్సీలకు పంచాలని, ఉర్దూ హై స్కూల్‌లో ముగ్గురు ఉర్దూ టీచర్లను నియమించాలని కోరారు. ఎంపిడిఒ శశికళ మాట్లాడుతూ... జన్మభూమిలో వచ్చిన వినతులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఎంపిటిసిలు రమాదేవి, శిరీష, టిడిపి నాయకులు మల్లికార్జునరెడ్డి, ఉపాధి సిబ్బది రాజారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్‌బాబు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - డోన్

రాజకీయాలకతీతంగా అర్హులందరి కీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. బుధవారం డోన్ మండలం ఉంగరానిగుండ్ల గ్రామంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి రాముడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జన్మభూమి ద్వారా గ్రామాలాభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేసి సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 28 వేల మంది లబ్ధిదారులకు జన్మభూమిలో రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అర్హులకు పింఛన్లను పంపిణీ చేయడంతో పాటు వడ్డీలేని రుణాలను కూడా అందిస్తున్నామన్నారు. చంద్రన్న బీమా ద్వారా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని తెలిపారు. గర్భిణులకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించడంతో పాటు ప్రసవించిన మహిళలను గమ్యస్థానాలకు కూడా చేరుస్తున్నామని చెప్పారు. ఈ విషయంపై ప్రతిఒక్కరూ గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యవసాయం మరింత అభివృద్ధి దిశగా సాగాలని, రైతులకు ఆన్‌లైన్ ద్వారా సేవలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశీలకులు, ఎమ్మెల్సీ శమంతకమణి, ఆర్‌డిఒ హుస్సేన్‌సాహెబ్, డిఎంహెచ్ఎం నరసింహులు, ప్రత్యేకాధికారి రాఘవరెడ్డి, తహశీల్దార్ మునికృష్ణయ్య, మార్కెట్ యార్డు ఛైర్మన్ మురళీకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

నందికొట్కూరు : సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని, మహిళలు అభివృద్ధి చెందినప్పుడే సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని రాయలసీమ రేంజ్ డిఐజి మహ్మద్‌ఇక్బాల్ తెలిపారు. పట్టణంలోని 5, 6వ వార్డుల్లో నిర్వహించిన 5వ విడత జన్మభూమి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఐజి మహ్మద్‌ఇక్బాల్, జడ్‌పి ఛైర్మన్ మల్లెల రాజశేఖర్, టిడిపి ఇన్‌ఛార్జి మాండ్ర శివానందరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడారు. నందికొట్కూరు పట్టణంలోని 5వ వార్డు కౌన్సిలర్ ముర్తుజావలీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎంటెక్ చదివి విదేశాలకు వెళ్లకుండా తన ఊరు అభివృద్ధి చెందించాలని 23 వార్డుల్లో ప్రథమ స్థానంలో నిలిపిన ముర్తుజావలీని ఆయన అభినందించారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడారు. నందికొట్కూరు మున్సిపాలిటీకి ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు చేసి అభివృద్ధికి తోడ్పడుతున్నామని తెలిపారు. మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ... శాశ్వత తాగునీటి పథకానికి రూ.140 కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించామని తెలిపారు. అలగనూరు జలాశయం నుంచి నందికొట్కూరుకు పైపులైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. డిఐజి చేతుల మీదుగా పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాలిటీని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపిన కమిషనర్ కెఎల్ఎన్.రెడ్డిని అభినందించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుబ్బమ్మ, వైస్ ఛైర్మన్ మునాఫ్, డీఎస్పీ మాధవరెడ్డి, సిఐ వెంకటరమణ, మున్సిపల్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

మిడుతూరు : తలముడిపిలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి జడ్‌పి ఛైర్మన్ రాజశేఖర్, నందికొట్కూరు ఎమ్మెల్యే ఐజయ్య, టిడిపి ఇన్‌ఛార్జి శివానందరెడ్డి హాజరయ్యారు. జడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ... టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్అండ్‌బి రోడ్లు, సిసి రోడ్లు నిర్మించామని తెలిపారు. గ్రామసభల్లో రుణమాఫీ కావడం లేదని కొందరు రైతులు వారి దృష్టికి తీసుకొచ్చారు. వారు స్పందించి... మండలంలో రుణమాఫీ కానివారి జాబితాను తయారు చేసి కలెక్టర్‌కు అందజేయాలని తెలిపారు. నోడల్ అధికారి జయప్రద, ఎంపిపి సీతమ్మ, మార్కెట్‌యార్డు ఛైర్మన్ రమణారెడ్డి, సహకార సొసైటీ అధ్యక్షులు కాతా రమేష్‌రెడ్డి, జిల్లా యువత ప్రధాన కార్యదర్శి వంగాల శివరామిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచి పాల్గొన్నారు.

6న ప్రభుత్వాస్పత్రి సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6వ తేదీ ఆస్పత్రి ఎదుట సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు మండల కార్యదర్శి సద్దాం హుసేన్, నాయకులు దాసరి బంగారయ్య తెలిపారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం వైద్యం కోసం తగినన్ని నిధులు కేటాయించడం లేదని పేర్కొన్నారు. పేరుకు నంద్యాల ఆస్పత్రిగా ఉందే తప్ప సౌకర్యాలు కల్పించడంలో ఏమాత్రం శ్రద్ధ లేదన్నారు. ఆస్పత్రిలో తాగునీటి సౌకర్యం లేదంటే ఆస్పత్రి దుస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవ చ్చున్నారు. ఆస్పత్రిలో సమస్యల పరిష్కారం కోసం జరిగే ఈ ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిపిఎం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - నంద్యాల

ఆలూరులో సిపిఎం 21వ జిల్లా మహాసభలు ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా నాయకులు మస్తాన్‌వలి తెలిపారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో మహాసభల విజయవంతాన్ని కోరుతూ వాల్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా నాయకులు మస్తాన్‌వలి మాట్లాడారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు, కేంద్ర కమిటి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే గఫూర్, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు హాజరవుతారన్నారు. పట్టణ కార్యదర్శి కేఎండి గౌస్, మండల కార్యదర్శి సద్దాం హుసేన్, మహానంది, గోస్పాడు మండలాల కన్వీనర్ పుల్లా నరసింహులు మాట్లాడారు. సిపిఎం నాయకులు తోట మద్దులు, లక్ష్మణ్, బంగారయ్య పాల్గొన్నారు.

దళితుల బహిష్కరణ అమానుషం

రుద్రవరం : స్థానిక నక్కలదిన్నె గ్రామ దళితులను గ్రామం నుంచి బహిష్కరించడం అమానుషమని ఏపి దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ముపాలెం శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎంజె బాబురాజు, కైలాస్ నాయక్, రమణయ్య, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రబాబు, న్యాయవాది బాలస్వామి, సిపిఐ నాయకులు బాబాఫక్రుద్దీన్, దళిత హక్కుల పోరాట సమితి కార్యదర్శి గురుదాసు గ్రామాన్ని సందర్శించారు. దళిత కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ముపాలెం శ్రీనివాస్ మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 7 దశాబ్దాలు దాటుతున్న ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్ట కరమన్నారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులతో జరిగిన సంఘటనపై ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు బాబురావు మాట్లాడుతూ నక్కలదిన్నె గ్రామాన్ని అట్రాసిటీ గ్రామంగా ప్రకటించాలన్నారు. దళితులకు రక్షణ కల్పించాలని, నక్కలదిన్నె గ్రామానికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నక్కలదిన్నె బహిష్కరణ బాధితుల కమిటీని ఎన్నుకున్నారు. కమిటి అధ్యక్షుడిగా ఏలీషా, ఉపాధ్యక్షుడుగా నాగన్న, కార్యదర్శిగా చంద్రశేఖర్, ట్రెజరర్‌లుగా చిన్న రాముడు, మరియమ్మ, పెద్దక్క, ఓబులమ్మ, గౌరవ సభ్యులుగా ప్రజా సంఘాల నుంచి నరసింహులు, హుసేన్ గుర్రప్ప, రామాంజనేయులు, భాస్కర్, చంటి ఓబయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి - నంద్యాల

నంది పరిశ్రమల మేనేజింగ్ డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం నంది ఇండోర్ స్టేడియంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడి, ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. రూ.45 లక్షలతో ఒక వాహనాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం గోపవరం సమీపంలోని సెయింట్ ఆన్స్ మానోవికాస కేంద్రంలో మానసిక వికలాంగుల మధ్య జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. నిత్యావసర వస్తువులను వారికి అందించారు.

పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

మండలంలోని ఎంఆర్‌సి భవనంలో మంగళవారం పిఆర్‌టియు క్యాలెండర్‌ను ఎంఇఒ రఘురామిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు సంఘం అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు రామకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



చౌక దుకాణాన్ని ప్రారంభిస్తున్న జడ్‌పిటిసి నాగమ్మ

చౌక దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి - చాగలమర్రి

స్థానిక పెద్దవంగలి గ్రామానికి కొత్తగా మంజూరైన చౌక దుకాణాన్ని జడ్‌పిటిసి నాగమ్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు నిత్యావసర సరుకులను ఆమె అందజేశారు. టిడిపి నాయకులు జగదీశ్వరరెడ్డి, రాంగుర్విరెడ్డి, ముల్లాఖాదర్ బాష, టిఎన్ఎస్ పుల్లయ్య, నరసింహులు, హరికిశ్చంద్రారెడ్డి, పాలసరీఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమీర్‌బాష

సావిత్రిబాయిపూలే ఆదర్శం

ఆళ్లగడ్డ : అజ్ఞానాంధకారంలో మగ్గుతున్న బాలికలకు విద్యను అందించేందుకు సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి చేశారని ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అమీర్‌బాష పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి అరుణోదయ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల క్రైం : నంద్యాల పట్టణం హనీఫ్‌నగర్‌లోని రోటరీ పాఠశాలలో గ్రీన్ సొసైటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనిధి రఘువీర్, గ్రీన్ సొసైటీ అధ్యక్షులు దండు వెంకటేశ్వర్లు, రోటరీ స్కూల్ కరస్పాండెంట్ డివి సుబ్బయ్య మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన వ్యక్తి సావిత్రిబాయి పూలే అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి జ్ఞాపికలు అందజేశారు. గ్రీన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పోసా శ్రీనివాసులు, సభ్యులు రాజు, కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

70 మంది టిడిపి నుంచి వైసిపిలోకి

ఆళ్లగడ్డ రూరల్ : మండలంలోని జి.జంబులదిన్నె గ్రామానికి చెందిన కొంతమంది టిడిపి కార్యకర్తలు బుధవారం తాలూకా వైసిపి ఇన్‌ఛార్జి గంగుల బిజేంద్రారెడ్డి(నాని) సమక్షంలో చేరారు. బిజేంద్రారెడ్డి గ్రామానికి చేరుకోగానే గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వైసిపి మండల కన్వీనర్ గజ్జల రాఘవేంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, రామలింగారెడ్డి, వీరభద్రారెడ్డి, శేఖర్, పెద్ద ఈశ్వరయ్య, ఓసేనితో పాటు 70 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరారు.సింగం భరత్‌రెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి పాల్గొన్నారు.



వైసిపిలో చేరిన గ్రామస్తులు

ఇళ్ల నిర్మాణాలను డిఇ పరిశీలన

రుద్రవరం : మండలంలోని ఆయా గ్రామాల్లో పక్కా గృహాలను త్వరగా నిర్మించుకోవాలని హౌసింగ్ డిఇ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పక్కాగృహాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద మండలానికి ఏడు గృహాలు మంజూరయ్యాయని చెప్పారు. ఒక్కో గృహానికి ఉపాధి పథకం కింద రూ.75 వేలు, హౌసింగ్ తరుపున రూ.1.25 లక్షలను ఇస్తామని చెప్పారు. ఈ గృహాలను మార్చిలోపు పూర్తి చేసుకోవాలని సూచించారు.

నిరుపేదలకు సహకరించకపోతే చర్యలు

- అధికారులపై మంత్రి ఆగ్రహం
- జన్మభూమిలో సమస్యల వెల్లువ
- పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ

చాగలమర్రి : గ్రామాల్లోని నిరుపేదలకు సహకరించకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న గృహనిర్మాణ, రెవెన్యూ శాఖాధికారులపై పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తోడెండ్లపల్లె, ముత్యాలపాడు గ్రామాల్లో సర్పంచులు వీరభద్రుడు, స్వప్న అధ్యక్షతన 5వ విడత జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ముత్యాలపాడులో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని అధికారులు ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఉగాది నాటికి అందరికి గృహాలు, రేషన్‌కార్డులు, పింఛన్లు అందజేస్తామన్నారు. గ్రామానికి 65 రేషన్‌కార్డులు, 47 పింఛన్లు మంజూరు చేశామన్నారు. జన్మభూమిలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖాధికారులు సహకరించడంలేదని, కార్యాలయాలకు వెళితే ఛీదరించుకుంటున్నారని ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి స్పందిస్తూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తే సహించేది లేదన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు ఆళ్లగడ్డ నుంచి ముత్యాలపాడు మీదుగా చాగలమర్రి వరకు బస్సు సౌకర్యం కల్పించేందుకు డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. అనంతరం గర్భిణులకు మంత్రి సీమంతం చేశారు. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు ఛైర్మన్ బివిరామిరెడ్డి, మండలనోడల్ అధికారి సంజీవరాజు, ఎంపిడిఒ రాణెమ్మ, హౌసింగ్ డిఇ సుబ్బారెడ్డి, తహశీల్దార్ మాలకొండయ్య, ఎంఇఒ అనురాధ, ఎఇలు సిద్దారెడ్డి, కొండారెడ్డి, మద్దిలేటి, పశువైద్యాధికారి పుల్లయ్య, ఇఒఆర్‌డి సుబ్బారెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఎపిఒ రామసుబ్బయ్య, ఎంసిఒ రాజ్‌కుమార్, ఎఇలు, అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యదర్శి వెంకటేశ్వర్లు, విఆర్వోలు నరసింహ, వెలుగుసిబ్బంది, సిరికల్చర్ అధికారులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రుద్రవరం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. ఆలమూరు గ్రామంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. సోమశివారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో మంత్రి అఖిలప్రియ




తహశీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి

మాట్లాడారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అధికారుల చుట్టు తిరగకుండా, అధికారులే వారి వద్దకు వెళ్లి వారి సమస్యలను పరిష్కరించేందుకు జన్మభూమి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వచ్చే ఉగాది నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందిస్తామన్నారు. ఆలమూరులో ఇంటి స్థలాలను పంపిణీ చేశారు. అనంతరం రైతులకు రైతురుణం కింద మంజూరైన ట్రాక్టర్లను పంపిణీ చేశారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ బివి రామిరెడ్డి, ఆర్‌డిఒ రామసుందర్‌రెడ్డి, తహశీల్దార్ శివరాముడు, ఎంపిడిఒ నీరజ, సర్పంచి జయరాముడు, సహకార సంఘం అధ్యక్షుడు పత్తి సత్యనారాయణ, నాయకులు ఎల్‌వి రంగయ్య, యర్రం ప్రతాప్‌రెడ్డి, గంధం భాస్కర్‌రెడ్డి, జంగా పుల్లారెడ్డి, కొల్లం పుల్లయ్య, పలువురు నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోస్పాడు : స్థానిక సాంబవరం, ఎం.కృష్ణాపురం గ్రామాల్లో జన్మభూమి - మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ సుధాకర్‌బాబు, ఎంపిడిఒ సుగణ్య శ్రీ, అధికారులు పాల్గొన్నారు. ముందుగా సిఎం అభ్యర్థసంగం ఏర్పాటు చేసిన చంద్రన్న సంక్రాంతి కానుకలను ప్రజలకు అందించారు. ఎంపిడిఒ సుగణ్య శ్రీ మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉంటేనే ఆనందంగా ఉండగలమని ప్రజలకు తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ రామనాథరెడ్డి, ఆర్‌ఐ నారాయణస్వామి, ఎపిఒ రామేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : స్థానిక తుడుములదిన్నె, గోవిందపల్లె



ఆళ్లగడ్డలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గ్రామాల్లో బుధవారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక అధికారి విజయుడు, తహశీల్దార్ మోజేష్ ప్రసన్, ఎంపిడిఒ మహేష్‌కుమార్ మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహించే జన్మభూమి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రజలకు ఏమైన సమస్యలుంటే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇఒఆర్‌పిఆర్ పాపారాయుడు, పిఆర్ ఎఇ వెంకటయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమేష్‌రెడ్డి, ఎపిఓ గణేష్‌బాబు. పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

నంద్యాల : పట్టణంలోని 5, 6, 7, 8వ వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అధ్యక్షతన జన్మభూమి సభలు నిర్వహించారు. సభలకు ముఖ్య అతిథులుగా శాసనమండలి ఛైర్మన్ ఎన్ఎండి ఫరూక్, ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి హాజరై, మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వార్డుల్లోని సమస్యలు సమావేశం దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఇళ్ల పట్టాలు, రేషన్‌కార్డులు, పింఛన్లకు అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. చంద్రన్న బీమా సభ్యత్వం కూడా తీసుకొని ప్రభుత్వ సహాయాన్ని పొందాలని కోరారు. పొదుపు సంఘాల వారు కనీసం నెలకు రూ.10వేలు ఆదాయం వచ్చే విధంగా పథకాలను ప్రభుత్వం పెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసిస్టెంట్ కమిషనర్ మోదకొండ, కౌన్సిలర్లు, మెప్మా పిడి రామాంజనేయులు, విద్యుత్ డిఇ నాగరాజు, సిడిపిఒ ఏగ్నెస్ ఏంజెల్, డిటి జనార్ధన్ శెట్టి, వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

కొత్తపల్లెలో : స్థానిక కొత్తపల్లె గ్రామంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జన్మభూమి ప్రతిజ్ఞ చేయించారు.

ఆళ్లగడ్డ : జన్మభూమి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ ఛైర్మన్ ఎద్దుల ఉషారాణి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయం, చింతకుంట్ల, కెవిఎస్ఆర్ కళాశాలలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డులు, పింఛన్లు, సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి, కౌన్సిలర్ సరోజమ్మ, కమిషనర్ వెంకటరామిరెడ్డి, సుజాత పాల్గొన్నారు. నల్లగట్ల, గూబగుండం గ్రామాల్లో ప్రత్యేక అధికారి వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి బండి చంద్రుడు, తహశీల్దార్ లక్ష్మీదేవి, ఎంపిడిఒ రాముడు పాల్గొన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటేశ్వరనాయక్, ఇఒఆర్‌డి మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగు నింపిన బ్రెయిలీ

నేడు లూయి బ్రెయిలీ జన్మదినం సందర్భంగా..


అంధులు ఆశ నిరాశల మధ్య క్షణక్షణం బతుకుపోరాటం సాగిస్తుంటారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని జీవితం గడపాల్సిన పరిస్థితిని నిరంతరం ఎదుర్కొంటున్నారు. వెలుగుచూడని అంధుల జీవితాలను సమాజం చిన్నచూపు చూస్తుంది. ఎక్కడో మానవత్వం ఉన్న కొంతమందే సానుభూతిని చూపుతారు. మరో మనిషి తోడు లేకుండా ఏ పని చేసుకోలేని దౌర్భగ్యపు స్థితిలో వారి జీవితాలు ఉంటాయి. అలాంటి అంధులకు అండగా నిలిచిన వ్యక్తి లూయి బ్రెయిలీ. అంధులకు విద్యాదానం చేసిన మహనీయుడు బ్రెయిలీ. అనంతపురం జిల్లాకు చెందిన ప్రముఖ కవి కెరె జగదీష్ అంధుల జీవితాలను కవిత్వీకరించిన 'రాత్రి సూర్యుడు' కావ్యం ఎస్కేయూలో పీజీ వారికి సిలబస్ అయ్యింది. నేడు బ్రెయిలీ జన్మదినం సందర్భంగా ప్రత్యేక వ్యాసం..

ప్రజాశక్తి- కర్నూలు కల్చరల్


అంధుల వెలుగు ప్రధాతగా పిలవబడుతున్న లూయిబ్రెయిలీ అంధులు చదువుకునేందుకు ఆరు అక్షరాల లిపిని కనిపెట్టాడు. అది సంగీతం వినడానికి, లెక్కల్ని అభ్యసించడానికి. ప్రస్తుతం అనేక సాఫ్ట్‌వేర్ల రూపకల్పనకు మార్గం అయ్యింది. 1809 జనవరి 4న పారిస్‌కు సమీపాన క్రూవే గ్రామంలో మానిక్ బారన్, సైమన్ రెనా బ్రెయిలీ దంపతులకు లూయీ జన్మించాడు. లూయి పుట్టుకతో కళ్లను కోల్పోలేదు. నాన్న జీన్లు తయారు చేసేవాడు. మూడవ ఏట తండ్రి పని చేసే చోట ఆడుకునేందుకు వెళ్లి పొరపాటున ఒక కన్నుకు కత్తి తగిలి కన్ను కోల్పోయాడు. మరో కన్ను కూడా పోవడంతో అంధుడయ్యాడు. కాని పట్టుదలతో పాఠశాలకు వెళ్లేవాడు. లూయీ ఆసక్తిని గమనించిన తండ్రి లూయి కోసం మేకులను ఒక చెక్కపై అక్షరాలుగా చేసి చేతులతో చదివించేవాడు. ధారణశక్తి, గ్రహణశక్తి ఉండటం వల్ల పాఠశాల ఉపాధ్యాయుల మన్ననలను పొందాడు. పదవ ఏటనే పారిస్‌లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ది బ్లైండ్‌లో స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. చదువు కొనసాగిస్తూనే అంధుల కోసం లిపి కనిపెట్టే పనిలో నిమగ్నమయ్యాడు. 1784లో వాలంటీన్ హవే స్థాపించిన పాఠశాలలో అంధుల కోసం వివిధ పనుల్లో శిక్షణ ఇస్తుండేవారు. అక్కడ చదువుకోడానికి ఉబ్బెత్తుగా రాగి రేకులపై అక్షరాలను రాసి చదివించేవారు. ఆ పాఠశాలను ఫ్రెంచి మాజీ ఆర్మీ అధికారి కెప్టెన్ చార్లెస్ బార్బేయర్ సందర్శించాడు. 12 గుర్తులతో రూపొందించిన లిపిని ఆయనకు చూపించాడు. ఇది సైనికులకు ఉపయోగపడే సంకేత భాష. దీన్ని ఆరు అక్షరాలకు కుదించి లిపిని కనిబెట్టాడు. దృష్టి లోపం ఉన్న వాళ్లు, అంధులు చదువుకోడానికి వీలుగా ఆరు అక్షరాలతో ఉబ్బెత్తుగా వుండి చేతి వేళ్లతో స్పృశిస్తూ చదువుకునేందుకు వీలుగా వుండటం ఈ లిపి ప్రత్యేకత. అందుకే ఈ లిపికి బ్రెయిలీ లిపిగా పేరు పెట్టారు. బ్రెయిలీ 1852 జనవరి 6న 43 సంవత్సరాల పిన్న వయస్సులోనే మరణించాడు. బ్రెయిలీ మరణ శతాబ్ది సందర్భంగా 1952లో ఆయన అస్తికలను పారిస్‌లో పాంథియన్‌లోకి మార్చి విశిష్ట వ్యక్తిగా గౌరవించారు. బ్రెయిలీ 200 జన్మదినోత్సవం సందర్భంగా 2009లో ప్రపంచవ్యాప్తంగా అతనిని కీర్తించారు. బెల్జియం, ఇటలీ బ్రెయిలీ బొమ్మతో రెండు యూరోల నాణాన్ని విడుదల చేశాయి. మన భారతదేశం బ్రెయిలీ గౌరవార్థం 2 రూపాయల నాణాన్ని అతని బొమ్మతో విడుదల చేసింది. అమెరికా ఒక డాలరు నాణాన్ని విడుదల చేసింది.

బహుముఖీయంగా రాణించి వారు కోకొల్లలు...

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రచయిత్రి హెలెన్ కెల్లర్, రచయిత జాన్ మిల్టన్, విశ్వ వాప్తంగా సంగీతప్రేమికుల గుండెల్లో నిలిచిపోయిన స్టీవ్ వండర్‌లు అంధులే. మన దేశానికి చెందిన సుప్రసిద్ధ రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం, ఇరవయ్యవ శతాబ్దపు సంగీత ప్రపంచంలో వయోలనిస్టుగా పేరొందిన ద్వారం వెంకటస్వామినాయుడు, హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో విశేష ఖ్యాతి గడించిన పద్మభూషణ్ పుట్టరాజ్ గవాయ్, హిందీ చలనచిత్ర పరిశ్రమలో సంచలనమైన మ్యూజిక్ డైరెక్టర్ రవీంద్రజైన్, ప్రస్తుతం డిల్లీ ప్రధానమంత్రి కార్యాలయంలో భారత రాయబారిగా సేవలందిస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి బుడిగి శ్రీనివాసులు రెడ్డి, గణిత బ్రహ్మగా పేరొందిన లక్కోజు సంజీవరాయ శర్మలు కూడా అంధులే.



నయనాల గాయాలను
గేయాలుగా పాడుతూ
స్నేహ పరిమళాన్ని రాల్చి
తెరచిన పుస్తకంలా ఆ జీవితం
వెన్నెల జలపాతంలో
తడిసిన ముత్యమవుతుంది.
చేతి కర్ర చెబుతున్న కన్నీటి కథలో
దు:ఖిస్తున్న హృదయం
గాయపడిన హృదయాలను తడిమి
మాటల మంత్రజలంతో కడిగి
ప్రేమ మొక్కను నాటుతుంది
కనుపాపల కడలిని
ఆవరించిన అమావాస్య చీకటిలో
పయనిస్తున్న జీవన నౌక
ఆటుపోట్ల అలల తాకిడికి గాయపడి
గమ్యం చేరేందుకు
పూల తివాచి పరచుకుంటుంది.
కూలిపోయిన ఆశల శిథిలాలలో
పాదముద్రలను వెదుకుతుంది.



కర్నూలు జిల్లాలో ఇద్దరు అంధ ఉపాధ్యాయుల దీనగాథ...

శిరివెళ్ల రషీద్‌కు ఉద్యోగం వచ్చినా పూల్‌లో ఉంచారు

డీఎస్సీ 2014 ద్వారా అంధుల కోటాలో శిరువెళ్లకు చెందిన రషీద్ ఉద్యోగం సాధించాడు. ఇటీవల కోర్టు ఉత్తర్వుల మేరకు ఈయనకు ఉద్యోగం వచ్చింది. జిల్లాలో భాషా పండితులు(తెలుగు) ఖాళీగా లేకపోవడంతో ఇటీవల డిఇఒ పూల్‌లో ఉంచారు. తాత్కాలికంగా కోసిగి మండలం కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సహాయకుల స్థానంలో పని చేయమన్నారు. సమీపంలోని కామనదొడ్డి పాఠశాల నుండి వేతనం ఇచ్చేలా ఎంఇఒకు ఆదేశాలిచ్చారు. విధుల్లో చేరారు. వందశాతం అంధుడైన రషీద్ విధులు నిర్వర్తించడం, వయోభారంతో ఉన్న తల్లితో ఉండలేక ప్రత్యక్ష బాధని అనుభవిస్తున్నాడు. డిఇఒ పూల్‌లో ఉంచినపుడు శిరువెళ్ల మండలంలో ఏదో ఒక పాఠశాల నుండి వేతనం ఇచ్చేలా, స్థానాలు ఖాళీ అయ్యే వరకు స్థానిక సంరక్షణలో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టవచ్చు. కాని అలా చేయక నిర్లక్ష్యంగా కందుకూరుకు పంపేశారు.


శ్రీశైలం నిరంజన్‌ది సొంతంగా ఏమీ చేయలేని పరిస్థితి

శ్రీశైలంకు చెందిన నిరంజన్ యస్జీటిగా 2014లో ఉద్యోగం సాధించారు. వంద శాతం అంధుడైన ఇతనికి దేవనకొండ మండలానికి సెప్టెంబర్ 15న పోస్టింగ్ ఇచ్చారు. సొంతంగా ఏమి చేసుకోలేని పరిస్థితి. అక్కడే వుండి విధులు నిర్వర్తిస్తున్నారు.

స్థానికంగా నియమించవచ్చు
కె.సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి, యూటిఎఫ్



అంధులకు పోస్టింగ్ ఇచ్చే సందర్భంలో స్థానికంగా ఇవ్వక రోష్టర్ ప్రకారం నియమిస్తారు. అయితే బదిలీలలో ప్రాధాన్యత ఇస్తారు. అలా కాకుండా వారిని స్థానిక మండలాలలో నియమిచడమే కాకుండా వారి స్వస్థలాల్లో నియమించవచ్చు. అక్కడ ఖాళీ లేకపోతే కనీసం సొంత మండలంలో సమీపాన నియమించవచ్చు. మానవత్వంగా ఆలోచించాలి. డిఇఒ పూల్‌లో పెట్టినప్పుడు అక్కడ ఏదో ఒక ప్లేస్ నుంచి వేతనాలు ఇస్తున్నప్పుడు స్థానికంగా నియమించలేరా..?



అంధులు సమాజంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు
యు.వెంకటేశ్వర్లు, సామాజిక కార్యకర్త, ఎమ్మిగనూరు

అంధులు సమాజంలో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం ఉన్నా వారి జీవితాలు ఘోరంగా వున్నాయి. వారికి సానుభూతి ఒక్కటే సరిపోదు. వారికి అన్ని అవకాశాలు ఇవ్వాల్సిందే.

హామీలకు పరిమితం జింకల పార్కు

అమలుకు నోచని సిఎం హామీ - రైతులకు తప్పని జింకల సమస్య

సత్ఫలితాలు ఇవ్వని ఆపరేషన్ బ్లాక్‌బక్ - ప్రతి ఏడాది కోట్లాది రూపాయల పంట నష్టం

ప్రతిపాదనలకే పరిమితమైన దేవరగట్టు జింకలపార్కు



జింకలు చూడడానికి చాలా అందంగా ఉంటాయి.. వాటిని చూసేందుకు ప్రజలు ఎంతో ఇష్టపడతారు. కానీ కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత రైతులు మాత్రం జింకలు చూస్తే తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏడాది జింకలు పంటలను నాశనం చేయడంతో రైతులు వాటిని చూస్తేనే భయాందోళనకు గురయ్యే పరిస్థితి ఉంది. జింకల సమస్యను పరిష్కరిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ నిచ్చినా అమలుకు మాత్రం నోచడం లేదు. దేవరగట్టు వద్ద జింకల పార్కు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ప్రతిపాదనలకే పరిమితమైంది. జింకలను పట్టేందుకు చేపట్టిన ఆపరేషన్ బ్లాక్‌బక్ కూడా సత్ఫలితాలను ఇవ్వలేదు.

ప్రజాశక్తి - ఆలూరు రూరల్

జిల్లాలోని ఆదోని డివిజన్‌లో ఆలూరు, ఆదోని, పత్తికొండ తదితర నల్లరేగడి ప్రాంతాల్లో జింకల సమస్య తీవ్రంగా ఉంది. దశాబ్ధం పైగా రైతాంగం జింకల కారణంగా వేలాది రూపాయల పంటలను నష్టపోతున్నారు. ఇలా ప్రతి ఏటా రైతులు కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించిన ప్రతిసారీ జింకల సమస్య పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైంది. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జింకల సమస్య పరిష్కరిస్తానని హామీనిచ్చారు. నీరు-చెట్టు కార్యక్రమంలో భాగంగా ఆలూరు మండలం కురివెళ్లి గ్రామ సభలోనూ, 2016 సెప్టెంబర్ 2న అరికెర గ్రామసభలో కూడా ఈ విషయాన్ని సిఎం ప్రస్తావించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలవుతుందని ఆశించిన రైతులకు ఆచరణలో అమలుకు నోచుకోక పోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు.

సత్ఫలితాలు ఇవ్వని ఆపరేషన్ బ్లాక్‌బక్

జింకలను పట్టుకుని ఫారెస్టులో వదలాలని 2004లో ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ బ్లాక్‌బక్ సత్ఫలితాలను ఇవ్వలేదు. ఆలూరు నియోజకవర్గంలో 2004 నుంచి 2006 వరకు ఈ పథకం కొనసాగింది. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ. 50 లక్షలు పైగా వెచ్చించింది. జింకలను పట్టుకునేందుకు నెట్‌లు, బోన్లు, టార్చిలైట్లను కొనుగోలు చేశారు. మూడేళ్లలో కొంత మేరకు జింకలను పట్టుకున్నా వాటిని పూర్తిగా నియంత్రించడంలో మాత్రం ప్రభుత్వం విఫలమయింది. ఆశించిన ఫలితాలు రాకపోవడంతో అర్థాంతరంగా ఆపరేషన్ బ్లాక్‌బక్ ఆగిపోయింది.



ప్రతిపాదనలకే పరిమితమైన దేవరగట్టు జింకలపార్కు


ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దేవరగట్టు ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయతలపెట్టిన జింకల పార్కు ప్రతిపాదనలకే పరిమితమైంది. ఇటీవల కాలంలో అటవీశాఖ అధికారులు జింకలను పట్టుకుని ఉంచేందుకు దేవరగట్టు ప్రాంతం అనువుగా ఉంటుందని జిల్లా అధికారులకు నివేదించారు. 750 ఎకరాల భూమి కేటాయించాలని ప్రతిపాదనలు పంపారు. పచ్చని పైరు ప్రాంతం, నీటి వసతితో కూడిన కుంటలు ఉండడంతో జింకలు జీవించేందుకు అనువుగా ఉంటుందని అధికారులు గుర్తించారు. కానీ ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

రైతులను పటించుకునేవారే లేరు
రైతు బసప్ప, మణేకుర్తి, ఆలూరు మండలం



రైతుల సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారు. జింకల సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో హామీలిస్తారే తప్ప ఆ తరువాత దాని గురించి పట్టించుకునే నాధుడే లేడు. జింకల కారణంగా ప్రతి ఏడాది వేల రూపాయల్లో నష్టపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యను పరిష్కరిస్తే బాగుంటుంది.

ఆదమరిస్తే పంటంతా నాశనమవుతుంది
రైతు తిక్కస్వామి, అరికెర గ్రామం, ఆలూరు మండలం



ప్రతి ఏడాది జింకల కారణంగా వందల ఎకరాల్లో పంటలు నాశనమవుతున్నాయి. పంట సాగు చేసిన తరువాత జింకలు పొలాల్లోకి రాకుండా పగలు, రాత్రి తేడా లేకుండా కాపాడాల ఉండాల్సి వస్తోంది. కొంత ఆదమరిస్తే జింకల మందలు పంటలను నాశనం చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యను పరిష్కరించి ఆదుకోవాలి.

ప్రతి ఏటా పంటలు దెబ్బతిని నష్టపోతున్నాం
రైతు ఈరన్న, అంగదస్కల్ గ్రామం, ఆలూరు మండలం



జింకల సంచారం కారణంగా రబీలో సాగు చేసిన పంటలు దెబ్బతింటున్నాయి. ప్రతి ఏడాది జింకల వలన పంటలు దెబ్బతిని నష్టపోతున్నాము. ఈ ఏడాది కూడా నాలుగెకరాల్లో సాగు చేసిన శనగ పంట జింకల కారణంగా దెబ్బతింది. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలి.

సిఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి
హనుమంతు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించిన ప్రతిసారీ జింకల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు. ఆలూరు ప్రాంతంలో పర్యటించిన రెండుసార్లూ కూడా చెప్పారు. జింకల సమస్యను పరిష్కరించాలని రైతులతో కలిసి అనేకసార్లు ఆందోళనలు చేపట్టాం. అయినా పాలకుల్లో ఎలాంటి చలనం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జింకల సమస్యను పరిష్కరించాలి. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తాం.



ఆర్‌యు విసి పోస్టుకు నోటిఫికేషన్

ముఖ్యనేతల చుట్టూ తిరుగుతున్న ఉన్నతాధికారులు

పదవీ కాలం పొడిగింపుపై విసి ప్రయత్నాలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి పోస్టుకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ నోటిఫికేషన్ మంగళవారం విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న విసి నర్సింహులు పదవీకాలం మార్చిలో ముగియనుండడంతో కొత్త విసి నియమాకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. మరోపక్క విసి నర్సింహులు కూడా పదవీ కాలం పొడిగించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి పదవీ కోసం అనేక మంది ఆశావహులు తమ ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన అనేకమంది ప్రొఫెసర్లతోపాటు ఇతర విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న వారు కూడా ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం పని చేస్తున్న విసి నర్సింహులు తీరుపై కూడా కొంతమంది ప్రజాప్రతినిధులు అంతగా మొగ్గ చూపనట్లు తెలిసింది. ఇప్పటికే అనేకమంది ప్రొఫెసర్లు సిఎం చంద్రబాబుతోపాటు మంత్రి గంటా శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇప్పటి నుంచి ఈ పోస్టు కోసం ఇప్పటికే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇదే జిల్లాకు చెందిన కొంతమంది సీనియర్ ప్రొఫెసర్లు కూడా పలువురు ప్రజాప్రతినిధులు సీరియస్‌గానే ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పాటు రిజిస్ట్రార్ పదవీ కాలం కూడా ముగియనుండడంతో ఈ పోస్టుపై కూడా దృష్టి సారించినట్లు తెలిసింది. ప్రస్తుతం పని చేస్తున్న రిజిస్ట్రార్ బి.అమర్‌నాథ్ పదవీ కాలం ముగియనుంది. దీంతో ఈ రిజిస్ట్రార్ పదవి కోసం అనేకమంది ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఏడాది విశ్వవిద్యాలయానికి మార్చిలో యుజిసి ఉన్నతస్థాయి బృందం పర్యటించనుంది. యుజిసి నుంచి నిధులను రాబట్టేందుకు ప్రస్తుతం ఉన్న విసి, రిజిస్ట్రార్‌లు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరో పక్క విశ్వవిద్యాలయంలోని ఉన్నతాధికారుల తీరుపై విద్యార్థులు, పలువురు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విసి ఒంటెత్తుపోకడలపై కూడా తీవ్రంగా కొంతమంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విశ్వవిద్యాలయానికి సమర్థులైన విసి, రిజిస్ట్రార్‌లను నియమిస్తే మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

బేతంచర్ల : పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు మద్దిలేటిరెడ్డి, లక్ష్మీకాంతనాయక్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్, జీవోల పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో మండల నోడల్ అధికారి వెంకటరమణ, ఎంపిడిఒ మోహన్‌కుమార్, ఎంఇఒ సోమశేఖర్ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. జిల్లా కౌన్సిలర్లు వై మనోహర్, కె.వెంకటేశ్వర్లు, మండల నాయకులు నాగశేషులు, ఉపాధ్యాయులు అహమ్మద్ హుస్సేన్, నాగేశ్వరరావు నాయక్, చంద్రుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సిపిఎం 21వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


బేతంచర్ల : సిపిఎం 21వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి వై యల్లయ్య, మండల కార్యదర్శి ఆర్ ఈశ్వరయ్య కోరారు. బుధవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో మహాసభల గోడపత్రికలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా వెనుకబడిన ఆలూరులో మొట్ట మొదటిసారిగా సిపిఎం జిల్లా మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. ఈ నెల 10, 11, 12వ తేదీల్లో ఆలూరులో మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కమిటీ సభ్యులు టి.షడ్రక్, వి.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రామాంజనేయులు పాల్గొంటున్నారని తెలిపారు.మండల నాయకులు వేణుగోపాల్, షాదిక్ హుస్సేన్, రామాంజనేయులు, నీలకంఠం, రహమతుల్లా, వెంకటసుబ్బయ్య, మధుశేఖర్ పాల్గొన్నారు.

షాపులపై దాడులు, జరిమానా

బనగానపల్లె అర్బన్ : పట్టణంలో వివిధ షాపులపై సేల్స్ టాక్స్ అధికారులు దాడులు చేసి జరిమానా విధించారు. బుధవారం పట్టణంలోని వెంకటేశ్వర ట్రేడింగ్ & కో, వెంకటరాముడు జ్యూవెల్లర్స్, విజయ క్లాత్ స్టోర్, నాగన్న కిరాణం షాపు, నవీన్ ట్రేడర్స్‌లపై నంద్యాల సిటిఒ సువర్ణరాణి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ షాపుల్లో వినియోగదారులకు రశీదులు ఇవ్వడం లేదని ఫిర్యాదు వచ్చాయని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కొక్క షాపుకు రూ.20 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కళాంజలి డ్రస్సెస్, వైష్ణవి టెక్స్‌టైల్స్ షాపులు రిజిష్టర్ లేకుండా నడుపుతుండడంతో నోటీసులు జారీ చేసి, రిజిష్టర్ చేయించుకోవాలన్నారు. దాడుల్లో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్, జిఎస్‌టి అధికారులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా పేదలకు వరం

కొలిమిగుండ్ల : చంద్రన్న బీమా పథకం పేద ప్రజలకు వరమని టిడిపి మండలాధ్యక్షులు ఎం.రామేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం గోరుమానుపల్లె గ్రామానికి చెందిన రత్నమ్మ అనే మహిళ మృతి చెందింది. ఆమె భర్త క్రిష్ణ రంగయ్యకు తక్షణ సాయం కింద చెక్కును బీమా మిత్ర శ్రావంతి, టిడిపి మండలాధ్యక్షులు రామేశ్వరరెడ్డి అందజేశారు.

నగదును అందజేస్తున్న రామేశ్వరరెడ్డి


కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలి

ప్రజాశక్తి బనగానపల్లె రూరల్

విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని నెహ్రూ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కోడూరు హరినాధరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెహ్రూ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ కమ్యూనికేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలని, మాతృభాషను మరువరాదన్నారు. కమ్యూనికేషన్ డే సందర్భంగా విద్యార్థులు ఆంగ్లంలో నాటికలు, సంభాషణలు, డ్యాన్స్, క్విజ్, డిబెట్ కార్యక్రమాలను చక్కగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమల్‌తేజారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ రవితేజారెడ్డి, ఎఒ లక్ష్మీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

జోనల్ గేమ్స్‌లో జడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థుల ప్రతిభ

బనగానపల్లె అర్బన్ : పట్టణంలోని కొండపేటలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు కోవెలకుంట్ల జోనల్‌స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరచి పథకాలు సాధించిన్నట్లు ప్రధానోపాధ్యాయులు రమణయ్య బుధవారం తెలిపారు. డిశంబర్ 29 నుంచి 31వ తేదీ వరకు అవుకులో జరిగిన కోవెలకుంట్ల జోనల్‌స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అండర్-17 కబడ్డీలో విన్నర్‌గా వాలీబాల్ నందు రన్నర్‌గా, అండర్-14 వాలీబాల్‌లో విన్నర్‌గా, సాఫ్ట్‌బాల్‌లో రన్నర్‌గా నిలిచిన్నట్లు తెలిపారు. అండర్-17 స్పోర్ట్స్ విభాగం 400మీటర్ల పరుగుపందెంలో యం శ్రీనివాసులు తృతీయ, 800 మీటర్ల పరుగుపందెంలో 4వ స్థానాన్ని సాధించిన్నట్లు తెలిపారు. రిలేరేస్ నందు తృతీయ స్థానం సాధించిన్నట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను, విజయానికి కారణమైన పిజికల్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు బాలరాజు, కొండయ్య, మాధవస్వామి, రాజు నాయక్, నాగరాజు, రామచంద్రమూర్తి, యాగంటప్ప, ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.


విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉపాధ్యాయురాలికి సన్మానం

అవుకు : సావిత్రి బాయి పూలే జన్మదినం సందర్భంగా కునుకుంట్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిని సన్మానించిన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరంగయ్య బుధవారం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

కొలిమిగుండ్ల : కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన ఏకలావ్య సంఘం జిల్లా కన్వీనర్ వై మల్లయ్య 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై మల్లయ్య తండ్రి పెద్దనాగయ్య వర్థంతి సందర్భంగా వితంతువులు, వయో వృద్ధులు 50 మందికి చీరలు పంపిణీ చేశారు. అనంతరం వారికి అన్నదానం ఏర్పాటు చేశారు. భార్య నాగలక్ష్మీ, గంగాధర్, శ్రీనివాసులు, సునీత, ఎస్‌టియు మండల అధ్యక్షులు వై శ్రీనివాసులు, మహిళలు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న వై మల్లయ్య

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే బిసి


చంద్రన్న కానుకలను అందజేస్తున్న ఎమ్మెల్యే బిసి.జనార్ధన్‌రెడ్డి

సంజామల : ప్రజల సమస్యలను పరిష్కరించేందకే జన్మభూమి కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం కమలపురి, వసంతాపురం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమంలో పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు తీసుకొస్తే, జన్మభూమిలో పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు. కమలపురి గ్రామంలో రూ.80 లక్షలతో సీసీ రోడ్డుకు ఆయన భూమి పూజ చేశారు. అనంతరం చంద్రన్న బీమాను పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేక అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులన్ని ఆన్‌లైన్ చేసి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచి తులసీశ్వర్‌రెడ్డి, ఆ గ్రామ నాయకురాలు విజయమ్మ, మండల టిడిపి ఇన్‌ఛార్జి మంచాల మద్దిలేటిరెడ్డి, ఓ(త)మాన్‌దిన్నె చంద్రశేఖర్‌రెడ్డి, నట్లకొత్తూరు పరమేశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, ఆకుమల్ల గోవిందురెడ్డి, తిమ్మయ్య, ఎంపిడిఒ మురళీకళ్యాణి, పంచాయతీ రాజ్ డిఇ సుధాకర్‌రెడ్డి, విఆర్‌ఒలు ఎరుకలయ్య, సుబ్బారాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బనగానపల్లె : ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బిసి.జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. యనకండ్ల, ఎర్రగుడి గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఎర్రగుడిలో రూ. 6 లక్షలతో వేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే బిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో రూ.1.50 కోట్లతో అన్ని వీధుల్లో సీసీ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. ప్రజల వద్దకే అధికారులు వచ్చి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మభూమి కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. గత పాలకులు జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చి ప్రాజెక్టులన్నింటిని పెండింగ్‌లో ఉంచితే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్ ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. జిఎన్‌ఎస్-ఎస్, గోరుకల్లు రిజర్వాయర్‌ను పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనన్నారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుటుంబం 30 సంవత్సరాల్లో చేయలేని అభివృద్ధిని తాము 3 సంవత్సరాల్లో చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష నాయకులు అభివృద్ధిని అడ్డుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. ప్రతిఒక్కరూ చంద్రన్న బీమా చేసుకోవాలన్నారు. పనికి ఆహారం పథకం కింద పనులు చేసిన తమకు వేతనాలు రావడం లేదని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. నెలలు గడుస్తున్న ఎందుకు కూలీల డబ్బులు ఇవ్వడం లేదని ఎపిఒపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధార్ సీడింగ్ కాక బిల్లులు ఇవ్వడం లేదని ఎపిఒ తెలిపారు. గ్రామంలో రూ.లక్షన్నర వరకు పెండింగ్ వేతనాలు ఉన్నాయని త్వరలో పరిష్కారం చేస్తామన్నారు. కొందరు మహిళలు తమకు పెట్టుబడి నిధి రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వీటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే వెలుగు అధికారులకు ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి సోమశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ వెంకటరెడ్డి, తహాశీల్దార్ నూకరాజు, మండల ఇంజినీర్ నాగశ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్, విద్యుత్ ఎఇలు సాయిక్రిష్ణ, రామసుబ్బన్న, పుల్లయ్య, ఎపిఒ ప్రతాప్, ఎపిఎం నాగరాజు, ఎఇఒ నరసింహులు, మాజీ ఎంపిపి అంబాల రామక్రిష్ణారెడ్డి, గ్రామ టిడిపి నాయకులు కప్పెట నాగేశ్వరరెడ్డి, ఘనమద్దిలేటి యాదవ్, బాలతిమ్మారెడ్డి, నరసింహులు, మురళీక్రిష్ణ, ఎల్లాలు, అధికారులు పాల్గొన్నారు.

ప్యాపిలి : ప్రజా సంక్షేమమే టిడిపి లక్ష్యమని జిల్లా గొర్రెల సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు యాదవ్, ప్యాపిలి మండల జన్మభూమి కమిటీ సభ్యులు టి శ్రీనివాసులు అన్నారు. ఏనుగుమర్రి, మెట్టుపల్లె, ఎన్ రంగాపురం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఎన్ రంగాపురం గ్రామంలో ఆర్‌డిఓ హుస్సేన్ సాహెబ్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఎంపిడిఒ అమృతరాజ్, తహాశీల్దార్ గోవింద్‌సింగ్, ఇఒఆర్‌డి ఐజయ్య, పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : ప్రజా సంక్షేమమే టిడిపి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం బెలుం గ్రామంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచి బంగి లక్ష్మమ్మ, ఎంపిటిసి మెంబర్ శీలయ్య, టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, తహాశీల్దార్ ఆంజనేయులు, ఇఒఆర్‌డి విజయరాజు పాల్గొన్నారు. గ్రామంలో చేసిన అభివృద్ధి పనులను అధికారులు వివరించారు. అనంతరం మాజీ ఉపాధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి 19 రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. దరఖాస్తులు ఇళ్ల నిర్మాణం కోసం-20, పింఛన్ల కోసం-40, రేషన్‌కార్డులు కోసం-32 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. గ్రామంలో ఉన్న స్కూళ్లకు ప్రహారీలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. అనంతరం గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్న ప్రసరణ చేశారు. తహాశీల్దార్ ఆంజనేయులు, పశువైద్యాధికారి రాఘవేంద్ర, వైద్యశాల అధికారి ముక్తార్‌బాష, హౌసింగ్ ఎఇ వాసుదేవారెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ప్రత్యేక అధికారి, ఉపాధి హామీ పథకం పీడీ రామక్రిష్ణ పేర్కొన్నారు. బుధవారం వల్లంపాడు, లింగాల గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్ కొండారెడ్డి ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లింగాలలో 12, వల్లంపాడు 7 రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఎంపిడిఒ రామక్రిష్ణ, డిప్యూటీ తహాశీల్దార్ హుస్సేన్‌భాష, లింగాల, వల్లంపాడు సర్పంచులు అరుంధతి, బాలతిమ్మయ్య, ఎంపిటిసి రమాదేవి, ఎపిఒ రవిప్రకాష్, హౌసింగ్, మండల, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు రామసుబ్బన్న, నజీర్ అహమ్మద్, రవికిరణ్ పాల్గొన్నారు.

అవుకు : సమస్యల పరిష్కారం కోసమే జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి విశ్వనాధరెడ్డి అన్నారు. ఉప్పలపాడు, సింగనపల్లె గ్రామాల్లో జన్మభూమికార్యక్రమం నిర్వహించారు. ఉప్పలపాడులో రేషన్ కార్డులు 5 మంజూరు కాగా 18 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ మంజూరు చేశామన్నారు. ఎంపిడిఒ వెంకటేశ్వరరెడ్డి, తహాశీల్దార్ సంజీవయ్య, వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, ఇఒపిఆర్‌డి రంగనాయక్, విద్యుత్ ఎఇ భూపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కరిముల్లా, ఎపిఒ ప్రకాష్‌రావు, ఎపిఎం జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

పత్రాలను అందజేస్తున్న పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి


ప్రజా సమస్యలు పక్కదారి

సాంస్కృతిక కార్యక్రమాలకే జన్మభూమి పరిమితం
సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వని అధికారులు
నిలదీసిన సిపిఎం నాయకులు
ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు - రసాభాసగా జన్మభూమి


అధికారులను నిలదీస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-పాములపాడు

రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా చేపడుతున్న 5వ విడత జన్మభూమి కార్యక్రమం రసాభాసగా సాగింది. బుధవారం మండలంలోని లింగాల, చెలిమిల్ల గ్రామాల్లో అధికారులు, సర్పంచులు సుశీలమ్మ, ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా లింగాల గ్రామంలో ఉదయం 10 గంటలకు ప్రారంభంలోనే దళిత మహిళ సర్పంచి సుశీలమ్మ వేదికపైకి వచ్చేందుకు నిరాకరించారు. గత జన్మభూమిలో తెలిపిన సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోలేదని సిపిఎం మండల కార్యదర్శి బి.రామేశ్వరరావు తెలిపారు. సమస్యలను నోడల్ అధికారి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని తెలపడంతో సర్పంచి వేదికపైకి ఎక్కారు. ముందుగా స్కూల్, ఐసిడిఎస్ చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉపాధి పెండింగ్ వేతనాలపై చర్చించారు. అనంతరం హౌసింగ్, పింఛన్లు, రుణమాఫీపై చర్చించేందుకు సిపిఎం నాయకులకు అవకాశం ఇవ్వకపోవడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనర్హులకు పింఛన్లు ఇవ్వడం, నిజమైన అర్హులకు సంక్షేమ ఫలాలు అందకపోవడంపై సిపిఎం నాయకులు రామేశ్వరరావు, వెంకటేశ్వరరావు మండిపడ్డారు. కార్యక్రమాన్ని మధ్యలోనే ముగించి వెళ్లేందుకు అధికారులు ప్రయత్నించగా హైస్కూల్ గేట్లను వేసి అధికారులను నిలదీసి నినాదాలు చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ... ప్రజా సమస్యలను ప్రక్కనపెట్టి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి జన్మభూమిని ముగించారని తెలిపారు. గత జన్మభూమిలో ఇచ్చిన సమస్యలను పరిష్కరించకపోగా కనీసం సమాధానం చెప్పేందుకు నిరాకరించినందుకు అధికారులను నిలదీశారు. నోడల్ అధికారి తమ కోటాలో గ్రామాల్లోని అర్హులకు పింఛన్లు, పక్కాగృహాలు ఇచ్చేందుకు అంగీకరించారు. చెలిమిల్ల గ్రామంలో సిపిఎం నాయకులు బాలయ్య మాట్లాడుతూ... గ్రామాలకు అతి సమీపంలో శుద్ధజల వాటర్ ప్లాంట్ ఉన్నా చెలిమిల్ల, లింగాల గ్రామాలకు సరఫరా చేయకపోవడంపై అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. చెలిమిల్ల, లింగాల గ్రామాలకు శుద్ధజలాన్ని పంపిణీ చేయాలని కోరారు. సిపిఎం నాయకులు స్వామన్న, ఎస్ఆర్.రమణ, టైలర్ రమణ, బాలయ్య, బాల ఏసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్తపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే జన్మభూమి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రత్యేకాధికారి సుబ్బారావు, ఎంపిడిఒ కమలాకర్, తహశీల్దార్ రామకృష్ణ తెలిపారు. మండలంలోని ముసలిమడుగు గ్రామంలో సర్పంచి షకినాబీ ఆధ్వర్యంలో జన్మభూమి నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశాన్ని ప్రజలకు చదివి వినిపించారు. అనంతరం శాఖల వారీగా అధికారులు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఎర్రమఠం వైద్యులు గోపాల్, దీప నాగవేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం, మండల పశువైద్యులు శిరీష ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం, ఐకెపి ఆధ్వర్యంలో ప్రభుత్వం నుంచి ఏర్పాటు చేసిన కిరాణ స్టోర్‌ను, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఎపిఎం ఉమామహేశ్వరమ్మ, ఎపిఒ ఉషారాణి, ఎఒ నాగేంద్రప్రసాద్, పిఆర్ ఎఇ రామచంద్రయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పక్కీరయ్య, ఎంఇఒ శ్రీరాములు, హౌసింగ్ ఎఇ రంగస్వామి, వైస్ ఎంపిపి మహబూబ్‌బాష, గ్రామ నాయకులు రామకృష్ణారెడ్డి, పలు శాఖలాధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెలుగోడు : మండలంలోని మోతుకూరు గ్రామంలో జన్మభూమి ఎంపిపి అన్నారపు సీతమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు డిఐజి గోపాలరావు హాజరయి మాట్లాడారు. ప్రజలకు పోషకాహారాలపై వివరించారు. జన్మభూమి స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో సమస్యలతో పాటు పింఛన్, రేషన్‌కార్డులు, ఇంటి స్థలాలు కావాలని ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ప్రభుత్వ వైద్యశాల నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఎందుకు ప్రారంభించడం లేదని జన్మభూమి కమిటీ సభ్యులను ప్రజలు నిలదీశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. నోడల్ అధికారి లాలా లజపతిరావు, ఎంపిడిఒ శివనాగప్రసాద్, ఎఒ సునీత, సర్పంచి భాగ్యమ్మ, నాయకులు సుధాకర్‌రెడ్డి, రామానాయుడు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు : సంతజూటూరు గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమానికి గోపాలరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని ప్రజలు అభివృద్ధి సాధించాలని కోరారు. ఎంపిడిఒ సుబ్బమ్మ, మండల ప్రత్యేకాధికారి నర్సిరెడ్డి, పశువైద్యాధికారి వెంకటసుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శి శేషకుమారి, విఆర్ఒ ఏసుపాదం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, డాక్టర్ రూపేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

జన్మభూమికి సహకరించని సర్పంచి

జన్మభూమికి ఇన్‌ఛార్జి సర్పంచి వేదనాయకం సహకరించలేదు. కార్యక్రమం ప్రారంభంలో కుర్చీలు, టేబుళ్లు లేక ప్రత్యేకాధికారి నర్సిరెడ్డితో పాటు ఎంపిడిఒ సుబ్బమ్మ, ఇతర అధికారులు కింద కూర్చొని ప్రారంభించాలని ఆలోచిస్తున్న సమయంలో పంచాయతీ కార్యదర్శిపై ప్రత్యేకాధికారి నర్సిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచి తమకు సహకరించడం లేదని పంచాయతీ కార్యదర్శి శేషకుమారి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కృష్ణారెడ్డి కల్పించుకొని టేబుళ్లు, కుర్చీలు తెప్పించడంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపులలో జన్మభూమి జరిగింది. టిడిపి జిల్లా కార్యదర్శి గిరీశ్వరరెడ్డి హాజరై మాట్లాడారు. చంద్రబాబు పరిపాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని తెలిపారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను పరీక్షించారు. అలాగే పొదుపు సంఘాలకు వడ్డీలేని రుణాలు, రైతు మిత్ర గ్రూపులకు చెక్కులు పంపిణీ చేశారు. అలాగే 14 మందికి రేషన్‌కార్డులు, 33 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. జడ్‌పిటిసి రంగారెడ్డి, సర్పంచి దీవెనమ్మ, నోడల్ అధికారి వెంకటరమణయ్య, టిడిపి నాయకులు నారాయణరెడ్డి, ఎంపిడిఒ సుబ్బారెడ్డి, తహశీల్దార్ జాకీర్‌హుస్సేన్, ఇఒఆర్‌డి మహ్మద్ హనీఫ్, ఎంఇఒ శ్రీనివాసులు, ఇఒ, వైద్యాధికారులు, రంగారెడ్డి పాల్గొన్నారు.

అధికారుల నిలదీత

పగిడ్యాల : మండలంలోని లక్ష్మాపురంలో స్థానికులు అధికారులను నిలదీశారు. గృహ నిర్మాణాల కోసం నాలుగు సార్లు దరఖాస్తులు చేసుకున్నా మంజూరు కాలేదని, జన్మభూమిని ఎందుకు నిర్వహించాలని స్వాములు, రమణ మరికొంతమంది నిలదీశారు. అర్హులందరికీ గృహాలు మంజూరవుతాయని అధికారులు చెప్పారు. నోడల్ అధికారి వీరారెడ్డి, తహశీల్దార్ కుమారస్వామి, ఎంపిడిఒ విజయలక్ష్మి, ఎఒ శ్రీనివాసరెడ్డి, ఇఒఆర్‌డి చంద్రశేఖర్, ఎపిఒ జయంతి, ఎంపిపి పుల్యాల దివ్య, సర్పంచి ధనలక్ష్మి, ఉప సర్పంచి గోవిందు, మాజీ జడ్‌పిటిసి పుల్యాల నాగిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు షేక్ ఉస్మాన్‌బాష, నాయకులు నాగశేషయ్య పాల్గొన్నారు.


అధికారులను నిలదీస్తున్న ప్రజలు

సిద్ధాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఈనెల 7న చేపట్టే సిద్ధాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 7న సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రులు, పలువురు మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. మండల ప్రజలు సంక్రాంతి సంబరాలను ముందుగానే జరుపుకునే విధంగా ప్రతి కార్యకర్త సిద్ధాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. 7న జరిగే బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. గ్రామాలతో పాటు ఆత్మకూరు పట్టణంలోని 20 వార్డులకు చెందిన బాధ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు నగర పంచాయతీ చైర్మన్ శివపురం నూర్ మహ్మద్, మాజీ ఎంపిపిలు డాక్టర్ మహేశ్వరయ్య, వంగాల శివరామిరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు బివి.కృష్ణగౌడు, పట్టణాధ్యక్షులు వరాల మాలిక్, జయకృష్ణ, కౌన్సిలర్ నబీరసూల్, అల్లీసా పాల్గొన్నారు.

వెలుగోడు : జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ చూపి అంతర్జాతీయ పోటీలకు వెళ్తున్న విద్యార్థులకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం అందేలా చూస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల గోవాలో స్వీఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పథకాలు సాధించిన బృందావనం, మోడల్ పాఠశాల విద్యార్థులు ఎం.నీలవేణి, బి.రేష్మ, ఇ.ఈశ్వర్‌ను బుధవారం పట్టణంలోని తెలుగుగంగ అతిథి గృహంలో ఆయన అభినందించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో ఆయనతో చర్చించి విద్యార్థులు అంతర్జాతీయ క్రీడలకు వెళ్లడానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందజేయాలని కోరతానన్నారు. సహకార సంఘం అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, నాయకులు అన్నారపు శేషిరెడ్డి, మాస్టర్ జ్యోత్స్న, బృందావన్ స్కూల్ కరస్పాండెంట్ ఫయాజ్ అలీఖాన్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు కిరణ్ పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.1,00,116 విరాళం

ప్రజాశక్తి-శ్రీశైలం

శ్రీశైలంలోని భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్ల దేవస్థానం క్షేత్రాన్ని సందర్శించే యాత్రికులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ అన్నదాన పథకానికి బుధవారం విజయవాడకు చెందిన బి.నవీన్‌కుమార్ కుటుంబ సమేతంగా కలిసి పర్యవేక్షకులు మధుసూదన్‌రెడ్డికి అన్నదానానికి రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ఆ తర్వాత విరాళం అందజేశారు.

శ్రీశైలంలో కడప జిల్లా యాత్రబృందం

శ్రీశైలం క్షేత్రాన్ని కడప జిల్లా వేముల మండలానికి చెందిన 200 మంది యాత్రబృందం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ బృందం ప్రత్యేక బస్సుల్లో ఆలయం వద్దకు చేరుకోగా వీరికి ఆలయ ద్వారం వద్ద స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. ఈ భక్త బృందానికి వేద ఆశీర్వచనంతో పాటు స్వామి, అమ్మవార్ల విబూది, కుంకుమ, కైలాస కంకణం అందజేశారు. ఉచిత వసతి, అల్పాహార, భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-కొత్తపల్లి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు ఎంకె.రాజేశ్వరమ్మ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.విజయభారతి తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయిపూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రథమ ఉపాధ్యాయులు సావిత్రిబాయిపూలే అని తెలిపారు. ప్రస్తుతం చాలామంది బాలికలను మధ్యలోనే చదువులు ఆపేసి, వివాహాలు చేసి వారి బాలికల జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ బాలికలను చిన్న నాటి నుంచే ప్రోత్సహించి సావిత్రిబాయిపూలే లాగా ఉపాధ్యాయురాలిని చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు వసంతలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాములపాడు : పాములపాడు సాక్షరభారతి ఎఇసి కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి ప్రజాసంఘాల నాయకులు వైఆర్‌డిఎస్ అధ్యక్షులు షర్ఫుద్దీన్‌అలీ, బిసి సంఘం నాయకులు నాగేశ్వరరావు, ఎంఆర్‌పిఎస్ నాయకులు స్వాములు, యాదవ సంఘం నాయకులు జివి.రమణ, రజక సంఘం నాయకులు ఆర్ఎస్ఆర్.మురళీమోహన్ నివాళులర్పించారు. వివిధ సంఘాల నాయకులు సోములు, వెంకటేశ్వర్లు, కరుణాకర్, రామసుబ్బయ్య, రామకృష్ణ, శివన్న పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణంలోని రంగమహల్ ఏరియా ఎంపియుపి పాఠశాలలో బుధవారం సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం బాలస్వామి, ఉపాధ్యాయులు జనార్ధన్‌రావు మాట్లాడారు. దేశంలో మహిళలకు విద్య అందకూడదని నిషేధించిన రోజుల్లోనే ఆమె మహిళలకు విద్య నేర్పించారన్నారు. ప్రత్యేకంగా పాఠశాలను కూడా ప్రారంభించారన్నారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జన్మభూమి సందర్భంగా క్రీడా పోటీలు

ఆత్మకూరు : మండలంలో జన్మభూమి కార్యక్రమం సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన బాలికలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. బుధవారం పిఇటి శివలక్ష్మీరెడ్డి, ప్రభాకర్, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఫస్పుల్‌మున్నా, పాఠశాల ఉపాధ్యాయులు బ్రహ్మానందం మాట్లాడారు. జన్మభూమి సందర్భంగా బాలికల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కబడ్డీ పోటీల్లో బాలురతో పాటు బాలికలు కూడా పెద్దఎత్తున పాల్గొనడం హర్షనీయమన్నారు. గెలుపొందిన వారికి 11న బహుమతులు అందజేస్తామన్నారు.


చంద్రన్న సంక్రాంతి కానులకు అందిస్తున్న గుడిసె కిష్టమ్మ

పకడ్బంధీగా ఆహార భద్రత చట్టం : కిష్టమ్మ

దేవనకొండ: ఆహార భద్రత చట్టాన్ని పకడ్బదీంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ఆ సంస్థ తనిఖీ సభ్యులు గుడిసె కిష్టమ్మ అన్నారు. బుధవారం ఆమె దేవన కొండకు వచ్చిన సందర్భంగా టిడిపి నాయకులు రామరావు నాయుడు, బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె చంద్రన్న సంక్రాంతి కానుకలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రేషన్ దుకాణ డీలర్లు ప్రతి నెల 1 నుంచి 15 వరకు తప్పనిసరిగా దుకాణాలను తెరచుకొని లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ప్రతిరోజూ ఒక గుడ్డు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందాలి

ఆదోని: ప్రభుత్వం చేపడుతున్న పథకాలు అర్హులైన పేదలకు అందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఎంఎల్‌సి కెయి ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గం ఇన్చార్జి కొంకా మీనాక్షినాయుడు అన్నారు. బుధవారం పట్టణంలోని 2వ వార్డుల్లో, బావజీపేట, ఆంజనేయస్వామి దేవాలయం, మండలంలోని గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా సభల్లో కమిషనర్ రామలింగేశ్వర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను ఖర్చు పెడుతోందన్నారు. ఈ పథకాలను అర్హులైన నిరుపేదలకు అందించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశంతో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకాన్ని చంద్రబాబు ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సిఎం దశలవారీగా నెరవేరుస్తుందన్నారు. సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి పద్మావతి, తహశీల్దార్ శ్రీనాథ్, ఎంపిడిఒ రామాంజినేయులు, కౌన్సిలర్లు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, భాస్కర్‌రెడ్డి, కొలిమి రామన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిని విస్మరించిన చంద్రబాబు : సిపిఎం

- సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధిని సిఎం చంద్రబాబునాయుడు విస్మరించారని, అభివృద్ధిని అమరావతి కేంద్రంగా మార్చడని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో సిపిఎం జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి ఎస్ఎం కాశీం అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సిపిఎం కార్యకర్తలు, హమాలీ, ఆటో వర్కర్స్, భవన నిర్మాణ కార్మిక యూనియన్ సభ్యులు బస్టాండ్ నుంచి గ్రామ ప్రధాన రహదారుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ పాలనలో అధికారుల అవినీతి పెరిగిపోయిందని అన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.2500 కోట్లు ఖర్చు చేసినా పునాది గోడలకే పరిమితమైందని పేర్కొన్నారు. ప్రజల డబ్బుతో విదేశీ పర్యటనలు చేస్తూ విలాసవంతమైన జీవితం గడుపుతూ ప్రజాధనాన్ని సిఎం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రాయలసీమ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని, శ్రీ కృష్ణ కమిటీ చెప్పిన విధానాలు ప్రభుత్వం అమలు చేయడం లేదని తెలిపారు. కులం, మతం పేరుతో టిడిపి, బిజెపి ప్రభుత్వాలు ప్రజల ఐక్యతను చీల్చడం జరుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను, బడా వ్యాపారులకు, రాజకీయాలకు లబ్ధి చేకూరిందని అన్నారు. ఆ విధానాలు సామాన్య ప్రజలపై పెను భారం పడిందన్నారు. జన్మభూమి ప్రజా సమస్యలకు వేదికగా ఉండేది పోయి టిడిపి ప్రచారానికి పరిమితమైందని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందకుండా పచ్చ కండువాలు ధరించిన వారికే కేటాయిస్తున్నారని చెప్పారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా 106 చెరువులకు నీరు అందించి, మండలంలో 40 ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధిక వర్షాలకు హంద్రీ వాగు పరివాహక గ్రామాల్లో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా, డివిజన్, మండల నాయకులు రాధాకృష్ణ, వీరశేఖర్, దస్తగిరి, శ్రీరాములు, రాఘవరెడ్డి, యుసుఫ్‌బాష, పరమేష్, ఆయా గ్రామాల నుంచి వచ్చిన సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె.ప్రభాకర్ రెడ్డి

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-పెద్దకడబూరు

కల్లుకుంట గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం జన్మభూమి అధికారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ తిక్కన్న మాట్లాడుతూ గ్రామంలో జనాభా పెరిగినప్పటికీ తాగునీటికి ఒకే ఓవర్ హెడ్ ట్యాంకు ఉండటం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని గత జన్మభూమిలో అధికారులకు విన్నవించుకున్న నేటికి పరిష్కారం కాలేదన్నారు. సమస్యలపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు జన్మభూమి కార్యక్రమం జరగనివ్వమని అధికారులతో వాదించారు. గ్రామంలో సరైన డ్రైయినేజీ వ్యవస్థ, సిసి రోడ్డు లేకపోవడం వలన పారిశుధ్యం లోపించి ప్రజలు రోగాల బారీన పడుతున్నారని వారు అధికారులకు వివరించారు. సమస్యలు పరిష్కరిస్తామని జన్మభూమి అధికారులు హామీ ఇవ్వడంతో జన్మభూమి కార్యక్రమాన్ని సజావుగా సాగేలా సహకరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సూర్యనారాయణ, కృష్ణ, బుడ్డన్న, మైనుల్లా తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

స్వయం ఉపాధితో అభివృద్ధి చెందండి

- టిటిడి సిఎస్ఒ ఆకె.రవికృష్ణ

ప్రజాశక్తి - దేవనకొండ

స్వయం ఉపాధితో యువత, మహిళలు అభివృద్ధి చెందాలని టిటిడి సిఎస్ఒ ఆకె.రవికృష్ణ అన్నారు. బుధవారం ఆయన కప్పట్రాళ్ల గ్రామాన్ని సందర్శించారు. ఎన్ఐఆర్‌డితో గ్రామానికి చెందిన ఏడుగురు యువకులు గతంలో ఇటుకల తయారీలో శిక్షణ పొందారు. గ్రామ శివారులో ఆ యువకులు ఏర్పాటు చేసిన ఇటుకల తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ ఇటుక తయారీ కేంద్రాన్ని ఎన్ఐఆర్‌డి సీనియర్ కన్సల్‌టెంట్ మహ్మద్‌ఖాన్, ఇంజినీర్ డీఎన్ మణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చదువుతోపాటు స్వయం ఉపాధిలో శిక్షణ పొంది అభివృద్ధి కావాలని సూచించారు. మరిన్ని ఇటుకల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఉపాధి కల్పించాలని తెలిపారు. ఈ తయారీ కేంద్రాలకు బ్యాంకుల నుంచి లోన్ ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకె.రవికృష్ణ సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గ్రామంలో పొదుపు లక్ష్మీ గ్రూపు మహిళలు తయారు చేసిన ఫినాయిల్, సర్ఫ్ సబ్బులను పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త నరసింహ, ఎపిబిజి రీజినల్ మేనేజర్ రామ సుబ్బారావు, ముప్పా ఫౌండేషన్ ఛైర్మన్ రాజశేఖర్, ఎంపిపి రామచంద్రనాయుడు, ఎస్ఐ గంగయ్య యాదవ్ పాల్గొన్నారు.


ఇటుక కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆకె.రవికృష్ణ

వివక్ష చూపిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎపి ఎమ్మార్పీఎస్ డిమాండ్

ప్రజాశక్తి-మంత్రాలయం


రాఘవేంద్ర సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామంలో దళితుల పట్ల వివక్షత చూపిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎపి ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నాయకులు చిక్కం జానయ్య మాదిగ, హనుమన్న మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం రాఘవేంద్ర సర్కిల్‌లో ధర్నా నిర్వహించి వాహనాల రాకపోకలను స్తంభింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్కలదిన్నె గ్రామంలో దళితులను సాంఘిక బహిష్కరణ చేసి వారికి నిత్యవసర సరుకులు అందకుండా కరెంట్‌ను, నీటి సరఫరాను నిలిపేసి ఇబ్బందులకు గురిచేసిన అగ్ర కులాల వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏదో ఒక చోట దళితులపై భౌతిక దాడులు జరుగుతున్న ప్రభుత్వ నియంత్రణలో అలసత్వం ఉందన్నారు. జెర్రిపోతు పాలెం వంటి ఘటనలు ఇందుకు నిదర్శనమన్నారు. పోలీసు యంత్రాంగం, అధికారులు నిఘాను ఏర్పాటు చేసి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర మాదిగ, హనుమంతప్ప మాదిగ, అంబ్రేష్ మాదిగ, హనుమప్ప మాదిగ తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి కమిటీలను రద్దు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-ఆదోని

జన్మభూమి కమిటీల పేరుతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని, ఈ కమిటీలను రద్దు చేయాలని డివైఎఫ్ఐ డివిజన్ పట్టణ కార్యదర్శులు ఉచ్చిరప్ప, వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు కార్యాలయంలో వారు మాట్లాడారు. అధికార పార్టీకి చెందిన టిడిపి కార్యకర్తలను జన్మభూమి కమిటీ సభ్యులుగా నియమించడం వల్ల ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందక కార్యకర్తలకు అందే అవకాశముందన్నారు. ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ప్రేక్షకపాత్ర వహించాల్సి వస్తోందన్నారు. నిరుపేదలందరూ చిన్నచిన్న ఇళ్లలో రెండు నుంచి మూడు కుటుంబాలు దుర్భర జీవనం గడుపుతున్నారన్నారు. తహశీల్దార్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా పనులు కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే పనులు జరుగుతున్నాయన్న విమర్శలున్నాయన్నారు. వీరి ఒత్తిళ్లకు అధికారులు బేజారెత్తి ప్రజల పనులు స్వచ్ఛందంగా చేయడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం చెందాయన్నారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాదులతో చేతులు కలిపి ముస్లింలు, దళితులపై దాడులకు పాల్పడుతోందన్నారు. ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రచారం చేయడంతో 10 వేలకుపైగా లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ పథకం కేవలం ప్రచారాల అర్భాటాలు తప్ప నిరుపేదలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. పట్టణంలో రూ.2,100 డిడిలు కట్టినా ఇంతవరకు స్థలాలు చూపడానికే గతి లేదన్నారు. పట్టణంలోని అంబేద్కర్‌నగర్, రాజరాజేశ్వరినగర్, తిరుమలనగర్, షేర్‌ఖాన్‌కొట్టాల్, విజయనగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో 40 ఏళ్లకు పైగా నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు పోరంబోకు, ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదలకు ఇంటి పట్టాలిచ్చేందుకు జిఓ296ను విడుదల చేసి హామీ ఇచ్చారని, ఇప్పటికైనా జన్మభూమి కమిటీ సభ్యుల ప్రమేయం లేకుండా అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పేదలకు అన్యాయం జరిగితే జన్మభూమిలో అధికారులు, ప్రజాప్రతినిధులను నిలదీసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు రహీమాన్, ఈరన్న, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమిలో సమస్యల వెల్లువ



మంత్రాలయంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-మంత్రాలయం

మండలంలోని బసాపురం, రాంపురం గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు అధికంగా వచ్చినట్లు నోడల్ అధికారి బాలునాయక్, తహశీల్దార్ పద్మనాభరావు తెలిపారు. బుధవారం జన్మభూమి మాఊరు కార్యక్రమంలో వివిధ ప్రభుత్వాధికారుల సమక్షంలో వారు మాట్లాడారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, గృహాలు, పట్టాదారు పాసు పుస్తకాలకై దరఖాస్తులు అందాయన్నారు. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, బాధ్యతల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి రాజేశ్వరి కోరారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి కనీసం ఈ ఏడాది నుంచైనా ప్రజలకు సమస్యలు పరిష్కరించడంలో కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ భీమిరెడ్డి, ఎంపిడిఒ మధుసూదన్‌రెడ్డి, ఈఓఆర్‌డి మల్లిఖార్జున, డిప్యూటీ డిఇఒ ఈరన్న, ఇతర మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని ఐరన్‌బండ, పి.అగ్రహారం గ్రామాల్లో ఎంపిడిఒ నాగరాజు, తహశీల్దార్ బాలగణేషయ్య ఆధ్వర్యంలో రెండు బృందాలుగా జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పరిశీలకులు ఐఎఫ్ఎస్ అధికారి సెల్వన్, నోడల్ అధికారి మురళీకృష్ణలు ప్రజలతో మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులైన లబ్ధిదారులు, పెన్షన్‌లు, ఎన్‌టిఆర్ గృహాలు, రేషన్‌కార్డుల కొరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ జర్మియా, హౌసింగ్ ఎఇ నజీర్‌అహ్మద్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో జన్మభూమి నిర్వహిస్తున్న అధికారులు



అవగాహన కల్పిస్తున్న సిఐ రాము

ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించరాదు

ప్రజాశక్తి-మంత్రాలయం

వాహనాలలో ప్రయాణీకులను పరిమితికి మించి ఎక్కించరాదని సిఐ రాము, ఎస్ఐ శ్రీనివాసనాయక్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆటో, ట్యాక్సీ యజమానులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రమాదాలు ఎక్కువగా జరగడానికి పరిమితికి మించిన ప్రయాణీకులను ఎక్కించుకోవడమే అన్నారు. నిర్ణీత వేగంతో వాహనాలు నడిపి ప్రయాణీకులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలన్నారు. ప్రతి డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన రికార్డులను పెట్టుకోవాలని లేని పక్షంలో కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మృతులకు రూ.15 లక్షలివ్వాలి

ప్రజాశక్తి- ఆదోని

ఆస్పరి సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షల పరిహారం చెల్లించాలని వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు డి.రామాంజినేయులు, కెవిపిఎస్ జిల్లా నాయకులు పిఎస్.గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన స్థలం, ఆసుపత్రులలో వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు.

రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో రాణించాలి : టిజి భరత్

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్



టిజి భరత్‌కు పూలబొకే ఇస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు రాణించాలని యువ పారిశ్రామికవేత్త టిజిభరత్ పిలుపునిచ్చారు. బుధవారం టిజి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాస్టర్స్ ఆరోగ్యంగా ఉండి క్రీడాస్ఫూర్తిని చాటి వర్తమాన క్రీడాకారులకు ఆదర్శంగా నిలవాలన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొని జిల్లా పేరును ఇనుమడింపజేయాలన్నారు. ఈనెల 5 నుంచి 7 వరకు శ్రీకాకుళం జరిగే రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన 40 మంది క్రీడాకారులు (వృద్ధులు) పాల్గొంటారని జిల్లా సంఘం అధ్యక్షులు పాండురంగారెడ్డి, రంగస్వామి తెలిపారు.

తుంగభద్ర నదిపై రిజర్వాయర్ నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కౌతాళం



జన్మభూమిలో వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

తుంగభద్ర నదిపై మండలంలోని మెళిగనూరు సమీపంలో రిజర్వాయర్ నిర్మించాలని జన్మభూమి కార్యక్రమంలో సిపిఎం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. బుధవారం కాత్రికి గ్రామంలో జన్మభూమి మాఊరు కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి లింగన్న, సీనియర్ నాయకులు మల్లయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో తుంగభద్ర నదిలో లక్ష క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతున్నాయన్నారు. రిజర్వాయర్ నిర్మించి ఆనీటి ద్వారా పశ్చిమ ప్రాంతం సస్యశ్యామం చేయవచ్చన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తుంగభద్ర దిగువ కాలువ ఆంధ్ర వాటా కింద రావాల్సిన నీరు రాకపోవడంతో ఆయకట్టు పంటలు దెబ్బతిని రైతులు అప్పులపాలవుతున్నారన్నారు. రైతులకు ఈ కష్టాలు తీరాలంటే రిజర్వాయర్ నిర్మిస్తే సమస్య తీరుతుందన్నారు. జన్మభూమి కార్యక్రమంలో స్పెషలాఫీసర్ సత్యనారాయణస్వామి, మంత్రాలయం టిడిపి నాయకులు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ ఉలిగయ్య, ఉరుకుంద ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ చెన్న బసప్ప, ఎంపిడిఒ బంగారమ్మ, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



కౌతాళంలో చిత్రపటానికి పూలమాల వేస్తున్న దూద్‌బాష



ఎమ్మిగనూరులో ....

ప్రజాశక్తి-విలేకరులు

కౌతాళం: మండలంలో సావిత్రిభాయి పూలే జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిభ హైస్కూల్‌లో మదీనా ఎడ్యూకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సావిత్రిభాయి చిత్రపటానికి కరస్పాండెంట్ దూద్‌బాష పూలమాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు మంచి నడవడికతో విద్యను అభ్యసించి మంచిపేరు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయులు ఈరన్న, పద్మ తదితరులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సావిత్రిభాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేశారు. హైస్కూల్ ఉపాధ్యాయులు అబ్దుల్ సలీం, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : సావిత్రిభాయి పూలే జీవితం ఆదర్శమని యుటిఎఫ్ జిల్లా సహ అధ్యక్షురాలు ఎన్.నాగమణి, మాచాని సోమప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు గౌసియాబేగం పేర్కొన్నారు. బుధవారం సావిత్రిభాయి పూలే జయంతిని పురస్కరించుకొని మాచాని సోమప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దైవందిన్నె జడ్పిహెచ్ఎస్ స్కూల్, దైవందిన్నె ఎంపిపిఎస్ మెయిన్, పార్లపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రిటిష్ కాలంలోనే అణగారిన వర్గాల కోసం పని చేశారన్నారు. మహిళా ఉపాధ్యాయురాలిని సన్మానించారు. కార్యక్రమంలో ఎం.సుజాత, సుమలత, లక్ష్మీదేవి, ఉమాదేవి, సునందకుమారి, యుటిఎఫ్ నాయకులు రాఘవేంద్ర, దావీద్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని పెద్దనెలటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మన్సూర్, యుటిఎఫ్ మండల మహిళా కన్వీనర్ సలోమి విశ్రాంతి ఆధ్వర్యంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిభాయి పూలే



గోనెగండ్లలో ఉపాధ్యాయినులకు సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు



పెద్దకడబూరులో చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

187వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలో ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉపాధ్యాయులను గుర్తించి వారికి గోనెగండ్ల యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. సన్మాన గ్రహీతలు ప్రభావతమ్మ, పావని, ధనలక్ష్మి, లక్ష్మీదేవిలు మాట్లాడుతూ మేము మా చుట్టు ఉన్న పరిసరాల్లో బాలికల విద్యా వ్యాప్తికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, కృష్ణవేణి, షహనాజ్, పుష్పలత, నాగలక్ష్మి, పద్మ, పరిమళ, యుటిఎఫ్ మండల నాయకులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: సావిత్రిబాయి పూలే జయంతిని యుటిఎఫ్, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెద్దకడబూరు కల్లుకుంట గ్రామాల పాఠశాల్లో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామన్న, యుటిఎఫ్ నాయకులు కౌలన్న, ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్ర మాట్లాడారు. ఆమె ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రాజు, ఉపాధ్యాయులు విజయకుమారి, సువర్ణ, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆదోని : సావిత్రిబాయి పూలే ప్రతి మహిళకు స్ఫూర్తి ప్రదాత అని బిసి సంక్షేమ సంఘం కార్యదర్శి బి.నీలకంఠప్ప అన్నారు. బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. స్త్రీలు, పురుషులను సమానంగా చూడాలని, ఆమెను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమలో ఎండి బసవరాజు స్వామి, విశ్వనాథరావు, ఎంసి ఆదిమూర్తి, సాయినాథ్, ప్రకాష్‌రావు, గిరిరాజు, చెన్నబసయ్య పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మొదటి మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు యుటిఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి హనుమంతు మాట్లాడుతూ సామాజిక విముక్తి బాట సావిత్రిబాయి పూలే అన్నారు. సమాజంలోని స్త్రీల వెనుకబాటుతనాన్ని రూపుమాపిన ధీరవనిత, నిరక్షరాస్యత జీవితాల్లో వెలుగు నింపిన ప్రజ్వళనశీలి అని కొనియాడారు. ఆమె జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో సునీల్‌రాజ్‌కుమార్, శ్రీనివాసులు, రమేష్, సులోచనాబాయి, రామకృష్ణ, రంగన్న, జిక్రియా, మునెప్ప, శీను, నజీర్, లక్ష్మన్న, పాపయ్య, రుద్రముని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు

ప్రతి మహిళ ముందుకు రావాలి

ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నిర్మల



సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆశీర్వాదమ్మ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సావిత్రిబాయి పూలే ఆశయసాధన కోసం ప్రతి మహిళ కృషి చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు, కెవిఆర్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపల్ ఆశీర్వాదమ్మ పిలుపునిచ్చారు. సావిత్రిబాయిపూలే 187వ జయంతి ఉత్సవాలను ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్‌సి రెడ్డి కళాశాలలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలమ్మ అధ్యక్షతన జరిగిన జయంతి ఉత్సవాలకు పి.నిర్మల, ఐద్వా పాణ్యం డివిజన్ అధ్యక్షురాలు ఎస్.శ్యామలమ్మ అధ్యక్షతన రవీంద్ర మహిళా డిగ్రి కళాశాలలో జరిగిన సదస్సుకు కెవిఆర్ రిటైర్డు ప్రిన్సిపల్ ఆశీర్వాదమ్మలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. సాంప్రదాయవాదులు పై చేయిగా ఉండే ఆ రోజుల్లో అభ్యుదయవాదిగా సావిత్రిబాయి పూలే మహిళల హక్కుల కోసం, సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే అభ్యుదయ విలువల కోసం ఎంతో కృషి చేశారన్నారు. కుల వ్యవస్థను ప్రతిఘటించారు. కులదురంహకారాన్ని, అణచివేతను వ్యతిరేకించారన్నారు. అణగారిన వర్గాల ప్రజలను, స్త్రీలను అక్కున చేర్చుకొని బాల్యవివాహాలను నిషేదించి వితంతు పునర్వివాహాలను జరిపించారన్నారు. అభాగ్య వితంతు స్త్రీలకు ధైర్యం చెప్పి వారి బిడ్డలకు ఆత్మవిశ్వాసం నింపారన్నారు. ఆశ్వీరాదమ్మ మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే మొట్టమొదటి మహిళా టీచరుగా పని చేశారన్నారు. స్త్రీలకు విద్యను నిషేదించిన రోజుల్లో స్త్రీలకు విద్యను నేర్పించేందుకు పాఠశాలలు ప్రారంభించారన్నారు. ఆర్‌సిరెడ్డి కళాశాల ప్రిన్సిపల్ స్రవంతి, కరస్పాండెంట్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లలు అన్నింటిలో ముందున్నారని అయితే వారిపై దాడులు మాత్రం తగ్గడం లేదని చెప్పారు. సావిత్రిబాయిపూలే అడుగుజాడల్లో నడిచి ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. మహిళా సంఘం జిల్లా నాయకులు పిఎస్.పద్మ, ధనలక్ష్మి మాట్లాడుతూ భారత శిక్షాస్మృతి (ఐపిసి 498 ఎ, సెక్షన్) వరకట్నపు వేధింపులు బారీన పడ్డ స్త్రీలకు రక్షణ ఉండే సెక్షన్ అన్నారు. ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగా రక్షణ చట్టం వచ్చిందన్నారు. వరకట్నపు వేధింపులకు గురైన స్త్రీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసిన దాని ఆధారంగా స్త్రీకి న్యాయం చేకూరుతుందన్నారు. చట్టం దుర్వినియోగం కాకుండా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కెవిఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివి రాజేశ్వరి, న్యాయ వ్యవస్థలోని జడ్జిలు హాజరై స్త్రీ హక్కులను గురించి వివరించారు.

బి.క్యాంపు బిసి కాలేజీ హాస్టల్‌లో : బి.క్యాంపు బిసి కళాశాల హాస్టల్‌లో సావిత్రిబాయి పూలే 187వ జయంతి పురస్కరించుకొని వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు వై.నాగేశ్వరరావు యాదవ్, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ పాల్గొని ప్రసంగించారు. ప్రాచీన కాలంలోనే బడుగు, బలహీన వర్గాల అభ్యుదయం కోసం, స్త్రీ విద్య కోసం, సమాజంలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప మహిళ అని కొనియాడారు. ఆమె జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆమె ఆశయసాధన కోసం ఆమె చూపిన మార్గంలో నేటి విద్యార్థినిలు ఆదర్శంగా తీసుకొని చదివి విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వరయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, బిసి విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కన్వీనర్ మోహన్, కమిటీ సభ్యులు శకుంతల, పుష్పావతి, హాస్టల్ వార్డెన్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమిలో నిలదీతలు.. నిరసనలు..

- లింగాలలో అధికారుల నిర్బంధం
- బనగానపల్లెలో దళిత ప్రజాప్రతినిధులకు అవమానం
- కేతవరంలో జన్మభూమిని అడ్డుకున్న సిపిఎం

ప్రజాశక్తి - లింగాల, బనగానపల్లె, ఓర్వకల్లు

జన్మభూమి మాఊరు కార్యక్రమం బుధవారం నిలదీతలు నిరసనల మధ్య సాగింది. అధికారులు ప్రజలకు సహకరించలేదని నిర్బంధాలకు కూడా దిగుతున్నారు. పాములపాడు మండలం లింగాలలో అధికారులను ప్రజలు నిర్బంధించారు. బనగానపల్లె మండలంలో దళిత ప్రజాప్రతినిధులను వేదిక మీదికి పిలువలేదు. అధికారం లేని వారిని అందలమెక్కించారు. ఓర్వకల్లు మండలం గార్గేయపురం నుంచి కేతవరానికి రోడ్డు నిర్మించాలని కార్యక్రమాన్ని సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.....



ఓర్వకల్లులో జన్మభూమిని అడ్డుకున్న గ్రామస్తులు

పాములపాడు మండలం లింగాల గ్రామంలో జన్మభూమి కార్యక్రమంలో అధికారులను నిర్బంధించారు. నోడల్ అధికారి హామీతో వదిలిపెట్టారు. సభ ప్రారంభంలోనే దళిత మహిళా సర్పంచి సుశీలమ్మ వేదికపైకి వచ్చేందుకు నిరాకరించారు. హౌసింగ్, పింఛన్లు, రుణమాఫీపై చర్చించేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు నినాదాలు చేశారు. అనర్హులకు పింఛన్లు ఇవ్వడం, నిజమైన అర్హులకు సంక్షేమ ఫలాలు అందకపోవడంపై సిపిఎం నాయకులు రామేశ్వరరావు, వెంకటేశ్వరరావు మండిపడ్డారు. సమాధానం చెప్పకుండా కార్యక్రమాన్ని మధ్యలోనే ముగించి వెళ్లేందుకు అధికారులు ప్రయత్నించగా గ్రామపంచాయతీ గేట్లకు తాళం వేసి అధికారులను నిలదీసి నినాదాలు చేశారు. నోడల్ అధికారి కల్పించుకుని ఇప్పటి వరకు పెండింగులో ఉన్న ధఖాస్తులను పరిశీలిస్తామని, నాకు కేటాయించిన నిధుల నుంచి ప్రత్యేకంగా ఖర్చుచేస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు ఆందోళన విరమించారు. కార్యలయం గేట్లను తెరిచారు.

బనగానపల్లె మండలం ఎర్రగుడి గ్రామంలో నిర్వహించిన జన్మభూమిలో ఎంపిపి సాలమ్మ, జడ్‌పిటిసి సభ్యులు రాజగోపాల్‌లకు తీవ్ర అవమానం జరిగింది. బుధవారం ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బిసి.జనార్ధన్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు. స్టేజి మీద మాజీ ఎంపిపి అంబాల రామక్రిష్ణారెడ్డిని, గ్రామ టిడిపి నాయకులు కప్పెట నాగేశ్వరరెడ్డిని కూర్చొబెట్టారు. ఎంపిపి సాలమ్మ, జడ్‌పిటిసి సభ్యులు రాజగోపాల్ సమావేశానికి వచ్చిన వారిని స్టేజి మీదికి పిలువలేదు. ఎంపిపి సాలమ్మ జనాల మధ్యలో నిలబడి ఉంది. జడ్‌పిటిసి సభ్యులను స్టేజి మీదికి పిలువక పోవడంతో సమీపంలోని దళిత కాలనీలోనికి వెళ్లారు. సీసీ రోడ్డు ప్రారంభించేటప్పుడు ఎంపిపి ఉన్నారు. కానీ గ్రామంలోని దేవస్థానం వెనుక స్టేజిని నిర్మించారు. అదే గ్రామానికి చెందిన ఎంపిపిని, సమావేశానికొచ్చిన జడ్‌పిటిసి దళితులు కావడంతో స్టేజిమీదికి పిలువలేదు. ఎంపిపి జనం మధ్యలో నిలబడడంతో గ్రామస్తులు దళిత మహిళ కావడంతో స్టేజిమీదికి పిలువ లేదని చర్చించుకుంటున్నారు. ఏ పదవులు లేని అగ్రవర్ణ నాయకులను స్టేజిమీదికి పిలిచి ప్రజా ప్రతినిధులైన దళితులైన ఎంపిపి, జడ్‌పిటిసిని స్టేజిమిదికి పిలువక పోవడం దారుణం.

గార్గేయపురం నుంచి కేతవరం గ్రామానికి బిటి రోడ్డు వేయాలని, సిసి రోడ్లు వేయాలని, సామూహిక మరుగుదొడ్లను కూల్చివేయడం వంటి స్థానిక సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు అధికారులను నిలదీశారు. జన్మభూమి మాఊరు కమిటీలను రద్దు చేసి ప్రతి ఒక్కరికి సంక్షేమఫలాలు అమలు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కేతవరం, పూడిచర్ల గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కెడిసిసిబి చైర్మన్ మల్లిఖార్జునరెడ్డి, పాణ్యం నియోజకవర్గ ప్రత్యేకాధికారి గోపినాథ్, జడ్పి సిఇఒ బిఆర్ ఈశ్వర్, డిఇఒ తాహెరాసుల్తానా హాజరయ్యారు. సిపిఎం మండల కన్వీనర్ బి.నాగన్న ఆధ్వర్యంలో నాయకులు గ్రామ సిపిఎం శాఖ కార్యదర్శి సూర్యనారాయణ, శ్రీధర్, సిద్దన్న, వెంకటేశ్వర్లు అధికారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేతవరం గ్రామం పర్యాటక కేంద్రంగా మారిందన్నారు. అలాంటి గ్రామానికి గార్గేయపురం నుంచి సరైన రహదారి లేక పర్యాటకులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండుగంటలపాటు జన్మభూమి కార్యక్రమాన్ని జరగకుండా అడ్డుకున్నారు. అనంతరం ఎంపిడిఒ మాధవీలత మాట్లాడుతూ గార్గేయాపురం నుంచి కేతవరం వరకు బిటి రోడ్డు నిర్మాణానికి రూ.1.20కోట్లు నిధులు విడుదలయ్యాయని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభించగానే బిల్లులను మంజూరు చేస్తామన్నారు.




బనగానపల్లెలో జనం మధ్య నిలబడిన ఎంపిపి సాలమ్మ

నేడు నీలకంఠేశ్వర స్వామి

మహా రథోత్సవం

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు



ముస్తాబైన నీలకంఠేశ్వరస్వామి దేవాలయం

పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి మహా రథోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త మాచాని నీలకంఠప్ప నాగరాజు బుధవారం తెలిపారు. ఈ రథోత్సవం గురువారం సాయంత్రం 5 నుంచి 6.30 గంటల మధ్య నిర్వహించబడుతుందన్నారు. రథోత్సవానికి కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, రాష్ట్రంలోని నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి రాజకీయ ప్రము ఖులు పాల్గొంటారు. పట్టణంలోని వివిధ కూడళ్లు, దేవాలయం, మహారథం అలంకరించారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

